ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
నవంబర్ 15, 2015

గురజాడ చెక్కిన శిల్పాలు

విశ్వ నటుడు

దీపికతో..

ఇర్ఫాన్ ప్రపంచ సినీ రంగంలో పరిచయం అక్కరలేని పేరు. లైఫ్ ఆఫ్ పై, జురాసిక్ వరల్డ్ లాంటి భారీ హాలీవుడ్ సినిమాల్లో ముఖ్యమైన పాత్ర పోషించిన భారతీయ నటుడు. నేమ్‌సేక్, లంచ్‌బాక్స్ వంటి ఇండియన్ ఇంగ్లిష్ సినిమాల ద్వారా విదేశీ ప్రేక్షకులకు దగ్గరయిన సహజ నటుడు. ఇపుడు అమితాబ్ వంటి అగ్రనటుల సరసన అంతే ప్రాధాన్యమున్న పాత్రలు చేస్తూ వర్సటైల్ నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. సినిమాతో సంబంధం లేని ఓ సాధారణ జైపూర్ కుటుంబం నుంచి వచ్చి డీడీ సీరియల్స్‌లో చిన్న చిన్న పాత్రలు చేస్తూ ఏ గాడ్ ఫాదర్ లేకుండా అంతర్జాతీయ నటుడిగా ఎదిగిన ఇర్‌ఫాన్ (తనను అలా పిలుచుకోవడం ఇష్టం) స్వయం కృషి అనే పదానికి బెస్ట్ ఎగ్జాంపుల్. కేవలం నటననే ప్రేమించి వస్తోన్న ఎందరో కళాకారులకు ఓ రోల్ మోడల్. ఇర్ఫాన్ నట ప్రస్థానంలో కొన్ని ఆసక్తికర విశేషాలు..

- ఎం.ఎ. చదివిన ఇర్ఫాన్ స్కాలర్‌షిప్‌తో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో 1984లో కోర్సు పూర్తి చేశాడు.
- కెరీర్ తొలినాళ్లల్లో 'చంద్రకాంత' వంటి పలు దూరదర్శన్ సీరియళ్లలో నటించాడు.
- అలీ జాఫ్రీ నిర్మించిన సీరియల్‌లో ఉర్దూ విప్లవ కవి, మార్క్సిస్టు మఖ్దూమ్ మొహియోద్దీన్ పాత్రలోను నటించాడు.
- తొలిసారి 1988లో మీరా నాయర్ 'సలాం బాంబే' చిత్రంలో అవకాశం వచ్చినా అతడి సన్నివేశాలు తొలగించారు.
- ఇర్ఫాన్‌కు సినిమా అవకాశం అమెరికా దర్శకుడు అసీఫ్ కపాడియా ద్వారా వచ్చింది.
- అతడే ప్రధాన పాత్రలో చారిత్రాత్మిక ఇతివృత్తంతో 'ది వారియర్' పేరిట వచ్చిన ఆ సినిమా అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శించడంతో తెలిసిన ముఖమయ్యాడు.
- షేక్స్‌పియర్ సృష్టి మెక్‌బెత్ ఆధారంగా వచ్చిన 'మక్బూల్' చిత్రంతో మంచి పేరు సంపాదించాడు.
- ఇర్ఫాన్ పదాల కంటే గట్టిగా అతడి కళ్లు మాట్లాడతాయనే విమర్శకుల ప్రశంసల్ని అందుకున్నాడు.
- 2007లో విడుదలైన 'మెట్రో', నేమ్‌సేక్ చిత్రాలతో బాలీవుడ్‌లో స్థిరపడ్డాడు.
- సీరియస్ యాక్టర్ ఇర్ఫాన్‌కు గొప్ప హిట్‌నిచ్చింది 2012లో వచ్చిన బయోపిక్ 'పాన్ సింగ్ తోమర్'.
- ఆర్మీకి చెందిన ఓ స్టార్ అథ్లెట్ బందిపోటుగా మారి తన కుటుంబాన్ని నాశనం చేసిన వారిపై పగ తీర్చుకున్న వ్యక్తి కథే పాన్ సింగ్ తోమర్.
- ఏంజెలినా జోలీ 'ఎ మైటీ హార్ట్'తో హాలీవుడ్‌లో తళుక్కుమన్న ఇర్ఫాన్‌కు ప్రాధాన్యమున్న పాత్రలు వచ్చాయి.
- సూపర్ మూవీ అయిన 'ది అమేజింగ్ స్పైడర్ మేన్'లోను నటించిన ఇర్ఫాన్ ప్రస్తుతం ప్రఖ్యాత హాలీవుడ్ దర్శకుడు డానీ బోయెల్ దర్శకత్వంలో దిగ్గజ నటుడు టామ్ హ్యాంక్స్‌తో కలిసి 'ఇన్‌ఫెర్నో'లో నటిస్తున్నాడు.
- అభిమానులు ఎటువంటి పాత్రలు తన నుంచి ఆశిస్తున్నారో, తన నటన ద్వారా ఆ చిత్రం, పాత్రలో ఎటువంటి ప్రభావం, వైవిధ్యం తేగలడో ఆలోచించాకే నిర్ణయం తీసుకుంటానని ఓ సందర్భంగా పేర్కొన్నాడు.
- ఆరుషి హత్య కేసుపై వచ్చిన 'తల్వార్' సినిమాలో ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్‌గా తన విలక్షణ నటనకు మార్కులు వేసుకున్నాడు.
- ప్రేక్షకుల హృదయాలను తట్టి ఎల్లకాలం నిలిచిపోయే కథలు, పాత్రలకే తన ఓటు అంటాడు ఇర్‌ఫాన్.
- రచయిత్రి, సహవిద్యార్థిని అయిన సుతాపా సిక్‌దార్‌ను 1995లో వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు.
- డోరె ఫిల్మ్స్ పేరిట ప్రొడ్యూసర్‌గా మారిన ఇర్ఫాన్, వరల్డ్ వార్ 2 అనే అంతర్జాతీయ మినీ సిరీస్‌లోను నటిస్తున్నాడు.

★

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

గుణపాఠం

ఎంత వారలైనా సరే! పాఠాలూ.. గుణపాఠాలూ... నేర్చుకుంటూ ... తమను తాము మార్చుకుంటూ ... ముందుకు పోవాల్సిందే. అప్పుడే అభివృద్ధి. మనిషికైనా. వ్యవస్థకైనా. 'ఠాఠ్! అంత గొప్పవాణ్ణి. ఇంత గొప్పవాణ్ణి. నేను పాఠం నేర్చుకోవడమేంటి? గుణపాఠం తీసుకోవడమేంటి?' అని అడ్డం తిరిగితే అతగాడు ఎంతటివాడైనా ... అంతటితో చరిత్ర ముగిసినట్టే. చాప చుట్టుకుని చంకలో పెట్టుకుని తీర్థయాత్రలకు వెళ్లిపోవాల్సిందే.

నరేంద్ర మోడీని, ఆయన అనుంగు మిత్రులను చూస్తుంటే 'ఠాఠ్' జాబితాకు చెందినవారిలాగే కనిపిస్తున్నారు. ప్రధానమంత్రి రేస్‌లో మోడీజీని నిలబెట్టినప్పుడు ఆయన గురించి చాలా చెప్పారు. అభివృద్ధికి ఆయనే అసలు సిసలు నమూనాగా వల్లించారు. పలు సార్లు పాలన వెలగబెట్టిన గుజరాత్‌ను అభివృద్ధికి ప్రతిరూపంగా ప్రచారం చేశారు.

ఆ రాష్ట్రంలో ధనవంతులూ వున్నారు. అభివృద్ధీ వుంది. అయితే అదంతా కొందరికే. మోడీ పాలనలో ధనవంతులు మరింత ధనవంతులయ్యారు. వారే మరింత అభివృద్ధి సాధించారు. పెద్ద సంఖ్యలో వున్న పేదలు నిరుపేదలయ్యారు. వీరికి పని దినాలు తక్కువగా వున్నాయని, పౌష్టికాహారం తగినంతగా లేదని, రక్తహీనతతో కునారిల్లిపోతున్నారని, శిశు మరణాలు ఎక్కువగా వున్నాయని అధ్యయనాలు అరచి గీపెడ్తున్నా... అబ్బే అలాంటి చిన్న చిన్న అంశాలు పట్టించుకోకూడదంటూ... ఆకాశానికి ఎదిగిన ధనవంతులనే చూడమన్నారు. మోడీ ప్రధాని అయితే గుజరాత్ నమూనా అభివృద్ధిని అన్ని రాష్ట్రాల్లోనూ సాధిస్తామని గప్పాలు చెప్పారు. మోడీ అండతో కాషాయ మూకలు సృష్టించిన మారణకాండను, బీభత్సాన్ని మర్చిపోతారనుకున్నారు. దేశంలోను, అంతర్జాతీయంగానూ పెద్దల సహాయ సహకారాలతో ప్రధానిగా ఎంపికవ్వడంతో ఇక తమకు ఎదురు లేదనుకున్నారు. గుజరాత్‌లోలాగా దేశంలో తమ పెత్తనం సాగించవచ్చని మోడీ సైన్యం ఆశపడింది.

కానీ చేసిన పాపం పోదని, ప్రాయశ్చిత్తం చేసుకునేదాకా వెన్నంటే వస్తుందని మరిచారు మోడీ. ఆ విషయాన్ని ఢిల్లీ ఎన్నికల్లో ప్రజలు చక్కగా చెప్పారు. చావు దెబ్బ కొట్టి కమలనాథులకు బాగా బుద్ధి చెప్పారు. ఆ దెబ్బతో అయినా బుద్ధి మార్చుకుంటారని, గుణపాఠం నేర్చుకుంటారని దేశ ప్రజలు ఎదురు చూశారు. ఊహూ... దేశ ప్రధానులైనంత మాత్రాన ... కాషాయ బుద్ధి ఎక్కడికి పోతుంది? ప్రశ్నించిన వారిని, నిజం మాట్లాడిన వారిని, వాస్తవాలు రాసిన వారిని పట్టపగలే పొట్టనబెట్టుకున్నారు. ప్రజాస్వామిక రచనలు చేసేవారి నెత్తిన ఇంకు పోశారు. 'గో మాత' పేర కొందరు తినే ఆహారంపైనా ఆంక్షలు పెట్టి అసహనం ప్రదర్శించారు. అనుమానాలతోనే అమాయకులను చంపేశారు. వీటన్నిటినీ గమనిస్తున్న ప్రజలు...కమలనాథులకు బుద్ధి వచ్చినట్టు లేదన్న నిర్ధారణకు వచ్చి... బీహార్ ఎన్నికల్లో మరో మారు బుద్ధి చెప్పారు.

ఇప్పటికైనా గుణపాఠం నేర్చుకుంటే మంచిది. లేకుంటే చాప చుట్టెయ్యాల్సిందే. ■

◆ మనలో మాట



టపా

విజ్ఞానదాయక కథనం

ఈవారం కవర్ స్టోరీ 'మావో చెప్పాడు ఆమె సాధించింది' విజ్ఞానదాయకంగా వుంది. ప్రపంచ వ్యాపితంగా మలేరియా వలన లక్షలాది మంది చనిపోయారు. 19వ శతాబ్దం ప్రారంభం నుంచే మందులు కనిపెట్టారు. అయితే 1971లో ఆర్టిమైసెనిన్‌ను కనిపెట్టిన 'తు యుయు' ప్రపంచ ప్రసిద్ధ పేరు సంపాదించు కున్నారు. మొత్తంగా శాస్త్రీయ విషయాలు తెలియచేసినందుకు అభినందనలు.

టి. శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ.

క్యాన్సర్ విజేతలు

స్త్రీ సాధించిన విజయాలు, వారి అనుభవాలను మాకు తెలిపినందుకు కృతజ్ఞతలు. క్యాన్సర్‌ను ఒక భూతంగా భావించే ఆ రోజుల్లో ఎందరో తారామణులు క్యాన్సర్‌ను జయించారు, వారి పోరాట ప్రతిమ నేటి తరానికి ఆదర్శప్రాయం కావాలని కోరుకుంటున్నాను.

దేవరాజు, చోడవరం, విశాఖపట్నం.

పట్టుగొమ్మలు

దేశానికి పల్లెలు పట్టుగొమ్మల్లాంటివని అంటారు. నగర జీవితంలో సాటి మనిషి బతుకు యాంత్రిక జీవితంగా మారిపోయింది. కడుపారా ఆరగించాలన్నా గ్రామాల వైపు చూడాల్సిందే. ఆకాశ హర్మ్యాలు ఎన్ని ఉన్నా, పల్లెటూరు వైపు చూడాల్సిందే. ఈ విషయాన్ని రచయిత బాగా వివరించారు. దేశానికి పట్టెడన్నం పెట్టే రైతన్నే ఎప్పటికైనా రారాజు. ఏదైనా అపాయం జరిగినప్పుడు ఏ విధంగా సహాయం చేయాలి అనే విషయం చాలా మందికి తెలియక వారిని అలాగే ఆసుపత్రులకు తీసుకొస్తున్నారు. ప్రాణాలు కాపాడకోగలుగుతున్నారు గాని వారికి శాశ్వత అంగవైకల్యం నుంచి కాపాడలేకపోతున్నారు. రీటా సాల్వా గాయపడ్డవారికి తక్షణమే ప్రథమ చికిత్స అందిస్తూ వారిని శాశ్వత అంగవైకల్యం నుంచి తప్పిస్తోంది. ఇలాంటి విషయాలు రచయిత బాగా చెప్పించారు.

సత్యవతి, తవ్వారిపల్లె, కడప

అందరికి అమ్మ

అందరికీ అమ్మ ప్రముఖ రంగస్థల నటీమణి, హాస్యరసాన్ని తెలుగు చిత్రాలలో వెదచల్లిన నిర్మలమ్మగారి గురించి చాలా విషయాలు తెలుసుకున్నాము. ఈ వారం కలర్ పేజీల్లో 'మట్టి బొమ్మలే' బాగున్నాయి. మట్టితో ఇంత అద్భుతమైన కళా ఖండాలు అబ్బురపరిచాయి. రీటా సాల్వా కృషి అభినందనీయం. మావో చెప్పాడు ఆమె సాధించింది కవర్ స్టోరీ బాగుంది. శాస్త్రీయ విశేషాలు తెలిపినందుకు ధన్యవాదాలు.

నాగరాజు, అనంతపురం

సాల్వా కృషి ఆదర్శం

ప్రయాణీకులకు రైల్వే స్టేషన్లలో జరిగే ప్రమాదాలకు తక్షణమే ప్రథమ చికిత్స సేవలు అందించి ప్రాణ నష్టాలను తగ్గిస్తున్న రీటా సాల్వా కృషి అత్యంత శ్లాఘనీయం. మొక్క నుంచి మలేరియా వ్యాధిని నయం చేసే ఔషధం కనుగొన్న యుయుతును నోబెల్ వారు 44 ఏళ్ళకు గుర్తించడం విడ్డూరం. గిన్నిస్ వరల్డ్ అద్భుతాలు చాలా బాగున్నాయి. రంగురంగుల అరటిపండ్లు నోరూరించాయి. మట్టితో తీర్చి దిద్దన అందమైన కళాకృతులు నివ్వెరపర్చాయి.

టి. సత్యనారాయణ మూర్తి, మల్కాపురం, విశాఖ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

గురజాడ చెక్కిన శిల్పాలు

కవర్ స్టోరీ 6

గురజాడ జీవితమంతా మహిళా విముక్తి కోసమే ఆశపడ్డాడు. ఆరాటపడ్డాడు. ఆయన రచనలన్నిటా చైతన్యవంతులైన స్త్రీ మూర్తులే తారసపడతారు. మధురవాణి, బుచ్చమ్మ, మెటిల్డా, పూర్ణమ్మ, కన్యక, మధురవాణి, పూటకూళ్లమ్మ, వెంకమ్మ, మీనాక్షి, మెటిల్డా, సరళ, కమలిని, సౌదామిని... అలాంటివారే. గురజాడ వారి నూరవ వర్ధంతి సందర్భంగా ఆ యా పాత్రలను ఈ వారం అట్టమీది కథలో మరో మారు గుర్తు చేసుకుందాం.

స్ఫూర్తి 3
షిరోస్ కేఫ్

రికార్డు 4
రబ్బరు బాలుడు

కార్టూన్ పంచ్ 5

రుచి 10
క్యాప్సికంతో కమ్మగా...

ప్రత్యేకం 11
నిద్రలో రెండు గ్రామాలు

సినిమా కబుర్లు 14
కన్నడింట తెలుగు చామంతి

వింత లోకం 16
కూతురితో ప్రపంచ యాత్ర

లఘు చిత్రం 17
పసిమొగ్గ అశ్విని

కథ 18
మేన్‌హోల్

చూద్దామా 21
రాయల్ గిరి చంద్రగిరి

బాల నేస్తాలు 22
అమ్మో...మూడు కళ్ళు...

కొత్త పుస్తకాలు 24
ఆదిరాజు వారి మన తెలంగాణము



సందర్భం -12
ముంబై 'భాయ్'లు

వారి కథలు వేరు, వారి ఊళ్లు వేరు, వారి అనుభవాలు వేరు కానీ వారి గాయం, బాధ మాత్రం ఒకటే. అందరూ యాసిడ్ దాడికి గురైనవారే. ఇప్పుడు వారి తావు కూడా ఒకటే. అదే ఆగ్రాలోని కెఫే షీరోస్ హ్యాంగౌట్. ఒకప్పుడు ఛిద్రమైన ముఖాన్ని చూపించలేక ఒంటరి జీవితానికి అలవాటు పడినవారే హీరోల్లా అడ్డు తెర తొలగించి కాన్ఫిడెంట్‌గా కెఫేను నడుపుతున్నారు. షీరోస్ అంటే (షీ, హీరోల మిళిత పదం) స్త్రీ హీరోలన్న మాట. వారి అడ్డా అయిన ఆ కెఫే వారి జీవిత పోరాటానికి తావు కూడా.

షీరోల కేఫ్

యాసిడ్ దాడి సమయంలో ఎంత వేదన ఉంటుందో ఆ తర్వాతి జీవితాన్ని గడుపుతున్నా అదే యాతన ఉంటుంది. చావు నుంచి బయట పడటం ఒక ఎత్తు అయితే, అంతా కాల్చేసి మానని గాయాల్ని మిగిల్చిన శరీరంతో అంతకు ముందులా గడపడం ఆవేశాన్ని, బాధను కలిగిస్తుంది. ముఖం చూపించలేక పదిమందిలోకి రాలేక ఒంటరి జీవితాలకు అంకితమయ్యేవాళ్లు కొందరైతే. ధైర్యం చేసి ఒక అడుగు ముందుకు వేద్దామంటే సమాజం చూపులు తాళలేని పరిస్థితి. ఇదే అనుభవమైంది కెఫే షీరోస్ హ్యాంగౌట్ నిర్వాహకులకు. కెఫే ప్రారంభించక ముందు వారి జీవితాలు అగమ్యగోచరం. ఒక్కొక్కరిది ఒక్కో నేపథ్యం. వంట వండే గీతా లోడిదో కథైతే కెఫేలో బొటిక్ నడిపే రూపాది ఓ కథ. ఉత్తర ప్రదేశ్, ముజఫర్‌నగర్‌కు చెందిన రూపాకు 15 ఏళ్లుండగా ఆమె సవతి తల్లి ఆమెపై యాసిడ్‌తో దాడి చేసింది. విందు వడ్డించే రోహ్‌తక్‌కు చెందిన రీతూకి 17 ఏళ్లున్నపుడు ఆస్తి వివాదాల కారణంగా బంధువులే దాడి చేయించారు. తల్లితో కలిసి కెఫే బాధ్యతలు చూస్తున్న నీతు మహోర్‌తో పాటు తల్లిని, చెల్లిని తండ్రే యాసిడ్‌తో హతమార్చబోయాడు. నెలల పసికందు అయిన చెల్లి కృష్ణ అక్కడే ప్రాణాలు కోల్పోగా నీతూ, తల్లి తీవ్ర గాయాలతో బయటపడ్డారు. ప్రేమ ఒత్తిళ్లు, ఆస్తి వివాదాలు కారణం ఏదైనా వారంతా తీవ్రంగా నష్టపోయారు. ఆ తర్వాత కోలుకున్నారు. కొత్త జీవితం ప్రారంభిద్దామని అనుకున్నారు. కానీ ఏ ఒక్కరూ వారికి పని ఇచ్చేందుకు ముందుకు రాలేదు. వారికి ధైర్యమివ్వాల్సింది పోయి వేధించే చూపులతో ఇబ్బంది పెట్టేవారు. ఇలా చీకట్లోకి వెళ్లిపోతున్న వీరికి 'స్టాప్ యాసిడ్ అటాక్స్' ఉద్యమకారులు చేయూతనిచ్చారు. నీతూ కథతో వెబ్‌సైట్ ఏర్పాటు చేసి నిధులు సమీకరించి ఆగ్రాలోని ఫతేబాద్ రోడ్డులోని తాజ్‌మహల్ గేట్‌వే వద్ద కెఫే ప్రారంభించేలా ప్రోత్సహించారు. అర్థవంతమైన గ్రాఫిటీ థీమ్‌లు, కేన్ ఫర్నీచర్‌తో పాటు రీడింగ్ సెక్షన్‌తో చాలా చూడముచ్చటగా కెఫేను తీర్చిదిద్దారు. వంట చేసే దగ్గర నుంచి విందు వడ్డించే వరకు, కౌంటర్ బాధ్యతలు అన్నింటినీ యాసిడ్ అటాక్ సర్వైవర్స్ ద్వారానే నిర్వహిస్తున్నారు. కెఫేపై సామాజిక మాధ్యమాల్లో విశేషమైన ప్రచారం కల్పించారు. ఈ ఆలోచన చాలా మందిని కదిలించింది. వారికి మద్దతుగా కెఫేకు వచ్చేవాళ్ల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా తాజ్‌మహల్‌ను సందర్శించేందుకు వచ్చే విదేశీ పర్యాటకులు ఈ కెఫే గురించి తెలుసుకుని మరీ వస్తున్నారు. కెఫేలో ఓ పక్కగా ఉండే గేలరీలోని చిత్రాలు పెయింటింగ్స్ వీరి ఆత్మవిశ్వాసాన్ని, మనోనిబ్బరాన్ని ప్రతిఫలిస్తాయి. ఫ్యాషన్ ఫొటోగ్రాఫర్ రాహుల్ సహరాన్ వీరితో తీసిన ఫొటోషూట్‌కు సంబంధించిన చిత్రాలవి. ఇవీ సంచలనం సృష్టించాయి. అందమనేది మనసుకు సంబంధించినది.. బాహ్య అందం దాని ముందు నిలవలేదని.. తమపై దాడి చేసిన వారంతా బయటకు అందంగా కనిపించే వ్యక్తులేనని చెప్పే ఈ షీరోస్ గాయాలు చేసిన మచ్చలే తమ జీవన పోరాటానికి ప్రతీకలని అంటారు. రీడింగ్ సెక్షన్‌లోని పుస్తకాలు కానీ, టీవీ సెట్‌లో ప్లే అయ్యే వీడియోలు కానీ మహిళా సాధికారత, పోరాటాలనే కథలుగా చెబుతాయి. కెఫే సేవల్ని అందుకున్నవారు వారికి తోచిన మొత్తాన్ని చెల్లించొచ్చు. ఇలా వచ్చిన డబ్బు ద్వారా మిగతా యాసిడ్ దాడి బాధితుల వైద్య, న్యాయ సేవల ఖర్చుకు ఉపయోగిస్తారు. ఇక్కడ లాభాలు ముఖ్యం కాదు. ఒంటరితనంలో చిక్కుకోకుండా బాధితులు తిరిగి సాధారణ, సామాజిక జీవితాల్లోకి చేరడమే. కెఫే ప్రారంభించిన 6 నెలల్లో 5 వేల మంది కస్టమర్లకు సేవలు అందించింది. ఇది ఓ పెద్ద విజయం. ఈ తరహా కెఫేల్ని ఢిల్లీ, లూథియానా, కాన్పూర్ వంటి మరికొన్ని ప్రాంతాల్లో స్థానిక యాసిడ్ దాడి బాధితుల్లో నడిపించాలనే ఆలోచన. కమ్యూనిటీ రేడియో కూడా ప్రారంభించి ఆర్జేలుగా వీరి సోషల్ లైఫ్‌ను మెరుగు పర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ కెఫేను నడుపుతూనే వివిధ రంగాల్లో తమ ప్రతిభ చాటేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకరు ఇంగ్లీష్ బోధకురాలిగా మారాలని కోర్సు చేస్తున్నారు. మరొకరు ఫ్యాషన్ డిజైనర్‌గా ప్రయత్నిస్తున్నారు. మరొకరు క్రీడల్లో సత్తా చాటేందుకు కసరత్తులు చేస్తున్నారు. కెఫేకు ముందు వీరిలో ఈ మార్పు లేదు. అంధకారంలోకి లాగబడే ఆలోచనల చుట్టూనే తిరిగారు. కానీ ఇపుడు తమ జీవితాల్లో వెలుగులు నింపుకునేందుకు వారికి వారే ప్రేరణగా నిలుస్తున్నారు. కెఫే అంత విశ్వాసాన్ని నింపింది. ✦

రికార్డు

ప్రపంచంలోని సూపర్ హ్యూమన్లను వెతికే పని అప్పజెబుతాడు డానియేల్ స్మిత్‌కు కామిక్ హీరోల సృష్టికర్త స్టాన్‌లీ. డానియేల్ కూడా ఓ సూపర్ హ్యూమనే. కాంటార్షనిస్ట్‌గా శరీరాన్ని ఎలా పడితే అలా మెలికలు తిప్పే అతడు చిన్న పెట్టెలో ఇరుక్కుపోగలడు. అలాంటి వాడు మన దేశంలోను ఉన్నాడు. రబ్బర్ బాయ్ ఆఫ్ ఇండియాగా పేరుతెచ్చుకున్న ఆ బడి పిల్లాడు జస్‌ప్రీత్ సింగ్ కల్రా.

రబ్బరు బాలుడు

జస్ప్రీత్ గురించి చెబుతూ డానియేల్ ఊసెందుకంటే అతడి వల్లే కాంటార్షనిస్ట్‌ల విన్యాసాలు ప్రపంచానికి బాగా తెలిసాయి. పంజాబ్‌లోని లూథియానాకు చెందిన జస్‌ప్రీత్‌కు ప్రేరణ కూడా అతడే. ప్రపంచంలోనే అతి అనువైన దేహం కలిగిన వ్యక్తిగా డానియేల్ పేరిట ఉన్న రికార్డును కైవసం చేసుకోవాలనేది జస్‌ప్రీత్ లక్ష్యం. దీని కోసం బాగానే మెలికలు తిరుగుతున్నాడు. కాళ్లను బాగా మడిచి భుజాల మీదకు ఎక్కించుకుంటాడు. తలను 180 డిగ్రీల కోణంలో తిప్పగలడు. సాధారణంగా మనిషి 90 డిగ్రీల కోణం వరకు మాత్రమే తలను తిప్పగలడు. పూర్తిగా వెనక్కి తిప్పి చూడగలడు. ఎవడి వీపు వాడు చూడలేడనే మాట జస్‌ప్రీత్ విషయంలో చెల్లదు. చేతుల్ని 360 డిగ్రీల కోణంలో తిప్పేయగలడు. వెనక్కు వంగి నీళ్లు తాగేయగలడు. పాదాలు, ముఖం వ్యతిరేఖ దిశలో ఉంచగలడు. ఇలా ఎన్నో విన్యాసాలతో గగుర్పాటుకు గురిచేసే జస్‌ప్రీత్‌కు ప్రస్తుతం 15 ఏళ్లు. తాను చదివే స్కూల్లో అతడో సూపర్‌స్టార్. ఉదయం వ్యాయామ సమయంలో పిల్లలంతా గుమికూడి జస్‌ప్రీత్ కసరత్తుల్ని ఫొటోలు తీసుకుంటారు. జస్‌ప్రీత్ ఆటోగ్రాఫ్‌లకు ఎగబడతారు. ఇక పండగకి, పబ్బానికి బంధువుల్ని తన ఒళ్లు తిప్పే కళతో ఆశ్చర్యపరుస్తారు. అతడి విన్యాసాలు చూసిన వారంతా జస్‌ప్రీత్‌కు ఎముకలు లేవేమో లేదా ఏదైనా ఇబ్బంది ఉందేమో అని వైద్యుల్ని సంప్రదించాలని సలహాలిస్తారట. కానీ అలా విన్యాసాలు చేస్తున్నపుడు జస్‌ప్రీత్‌కు అసలే ఇబ్బంది అనిపించదు. మనం మెటికలు విరిచినంత తేలిగ్గా శరీరాన్ని మెలితిప్పేస్తుంటాడు. ఏ రకమైన అనారోగ్య ఛాయలు కనిపించలేదు. చాలా ఆరోగ్యంగా ఉండే జస్‌ప్రీత్‌కు పది పదకొండేళ్ల వయసున్నపుడు అతడి తల్లి సురీందర్ కౌర్ కల్రా ఈ ప్రత్యేక దేహ తీరును గమనించింది. మొదట్లో భయపడినా ఆ తర్వాత వారికి జస్‌ప్రీత్ విన్యాసాలు అలవాటు అయిపోయాయి. 12 ఏళ్లపుడు యోగాలో చేర్పించడంతో అతడి ఫ్లెక్సిబిలిటీ మరింత ఎక్కువయ్యింది. కానీ మితిమీరిన విన్యాసాలు ప్రయత్నించడంతో ఓ సారి మోచేయి ఫ్రాక్చర్ అయ్యింది. అప్పుడు యూట్యూబ్‌లో ఇతర కాంటార్షనిస్ట్‌ల విన్యాసాలు చూసిన జస్‌ప్రీత్‌కు ఓ విషయం బాగా అర్థమయ్యింది. తన కన్నా మెరుగ్గా ఇతరులెవరూ తలను తిప్పలేరని తెలుసుకున్నాడు. ఏడాదిన్నర తర్వాత పూర్తిగా కోలుకున్న జస్‌ప్రీత్ తిరిగి విన్యాసాలతో ప్రదర్శనలివ్వడం ప్రారంభించాడు. వీటిని చూసే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అతడి పేరు చేర్చారు. ప్రపంచం దృష్టిని ఆకర్షించి అనేక విదేశీ మీడియా కవరేజీ కూడా పొందాడు. ప్రస్తుతం బడి పాఠాల్లో తలమునకలై ఉన్న జస్‌ప్రీత్ యోగానే కెరీర్‌గా ఎంచుకుంటాడనంటున్నాడు. కాంటార్షనిస్ట్‌గా రికార్డులు బద్దలు కొట్టి డానియేల్ తరహాలో పేరు సంపాదించాలని అనుకుంటున్న జస్‌ప్రీత్ ఇప్పటికే ఆ దరికి చేరిపోయాడు. తల్లిదండ్రులు కాంక్ష కూడా అదే కావడంతో మెలికలకు బ్రేకులు లేకుండా పోయాయి.

✦



కార్టూన్ పంచ్



సైడ్ ప్లీజ్!!
బాక్సైట్ తవ్వకాలకు గ్రీన్ సిగ్నల్
గంగాధర్

సర్వే చేయమని డబ్బులిచ్చారుగా..అందుకే మీకు ఫేవర్‌గా చేశాం.. మీ ఉప్పు తిన్నాంగా!!
?!
SURVEY
బీహార్లో తల్లకిందులైన సర్వేలు

జనాలు గుర్తుపట్టకుండా.. మీకు రక్షణగా ఉండాలని తెచ్చా
HELMET
హెల్మెట్ తప్పనిసరి



అసహనంపై నిరసన
?!

అట్టమీది కథ

గురజాడ జీవితమంతా మహిళా విముక్తి కోసమే ఆశపడ్డాడు. ఆరాటపడ్డాడు. ఆయన రచనలన్నిటా చైతన్యవంతులైన స్త్రీ మూర్తులే తారసపడతారు. మధురవాణి, బుచ్చమ్మ, మెటిల్డా, పూర్ణమ్మ, కన్యక, పూటకూళ్లమ్మ, వెంకమ్మ, మీనాక్షి, సరళ, కమలిని, సౌదామిని... అలాంటివారే. గురజాడ వారి నూరవ వర్ధంతి సందర్భంగా ఆయా పాత్రలను ఈ వారం అట్టమీది కథలో మరో మారు గుర్తు చేసుకుందాం.

గురజాడ చెక్కిన శిల్పాలు

డా॥ శమంతక మణి

9491962638

'వట్టి మాటలు కట్టి పెట్టోయ్... గట్టి మేల్ తల పెట్టవోయ్...' అని సమాజానికి తన రచనల్లో ప్రభోదం చేసి తెలుగు జాతి ఓ ఆధునిక జాతిగా మారడానికి తన వంతు కృషి చేసిన "కవి శేఖర" గురజాడ అప్పారావు. సామాజిక అభ్యుదయమే సాహిత్య ప్రయోజనమని బలంగా నమ్మి ఆచరించిన నవయుగ వైతాళికుడు. రాశి కన్నా వాసికి ప్రాధాన్యత యిచ్చే జనన మరణాల మధ్య సంవత్సరాలు కొనసాగించిన జీవన ప్రయాణంలో అక్షరాన్ని ఆయుధంగా మలచి తాను నివసిస్తున్న సమాజ ప్రజలల్లో నెలకొన్న అవిద్య, మౌఢ్యము, మత, వర్ణ కుల వ్యవస్థల అణచివేతపై పోరాటం చేసిన సాహిత్య పతాక. సామాజిక అభ్యుదయమే సాహిత్య ప్రయోజనమని నమ్మి సమాజంలో సృష్టిలో సగ భాగమైనా, దృష్టికోణంలో అట్టడుగు స్థాయిన చూడబడుతున్న మహిళా సమస్యలపై కొరడా ఝుళిపించిన సాహసికుడు.

లత, వనిత, లలన, సుందరి, సుకుమారి, సుమబాల, కోమలాంగి, మీనాక్షి, పతివ్రత, పావన మాత, సహనానికి భూదేవి అంటూ స్త్రీల పాత్రలకు ఓ వర్ణన, ఓ స్వభావాన్ని అక్షర బద్ధం చేశారు ప్రాచీన కవులు. చదివిన దాన్ని విన్నదాన్ని ఆచరణలోకి తేవడానికి కంకణ బద్దులయ్యారు ఛాందస సమాజవాదులు. అమ్మగా, ఆలిగా, సహోదరిగా, సహచరిగా సంచరిస్తున్న మహిళలను తమకు సాటిగా ధీటుగా స్త్రీగా చూడటంలో మానవ సమాజం తడబాటు పడుతూనే ఉంది. ఆకాశమంత విశాల స్వభావమున్న ఆడవారిని అబలగా మార్చడానికి ఆనాడు తపన పడింది. నేటికీ ఆ దిశగానే వ్యవహరిస్తుంది. అందుకే మహిళలకు రిజర్వేషన్"లు ఎందుకు? అని మంత్రుల నోట అలవోకగా వ్యాఖ్యానాలు వెలువడుతున్నాయి.

వ్యక్తి ఆలోచనే అతనికో స్థాయిని, సంస్కారాన్ని ఏర్పరుస్తుంది. మనస్సులో ఉన్నదే వాక్కుగా ఆచరణగా మారుతుంది. అమ్మాయిగా పుట్టి 'ఆడ' పిల్లగా సమాజం స్త్రీలను చూస్తున్న తరుణంలో శతాబ్దంన్నర కాలానికి పూర్వమే ఆధునిక మహిళను దర్శించారు అప్పారావుగారు.

సమాజంలో స్త్రీల నిస్సహాయత, పరాధీనత, అధోగతుల గురించి, స్త్రీ పురుష సంబంధాల్లో ద్వంద్వ ప్రమాణాల గురించి వివాహ కుటుంబ వ్యవస్థల్లో స్త్రీలు ఎదుర్కుంటున్న హింసలు, చెడు గూర్చి నిశితంగా గమనించి కలత చెందిన గురజాడ వారు మహిళా విముక్తి కోసం తన కలాన్ని బలంగా ఉపయోగించారు.

'పూర్ణమ్మ, కన్యక, మధురవాణి, బుచ్చమ్మ, పూటకూళ్లమ్మ, వెంకమ్మ, మీనాక్షి, మెటిల్డా, సరళ, కమలిని, సౌదామిని పాత్రలతోనే గాక అనుబంధ పాత్రలైన అక్క చెల్లెళ్ళు, వదినెలు, చెలికత్తెల ద్వారా స్త్రీ జాతి ఎదుర్కుంటున్న ప్రధాన సమస్యలైన బాల్య వివాహం, కన్యాశుల్కం, వైధవ్యం, వేశ్యా వృత్తి, ఛాందస భావాల గొడుగులో గడప దాటలేక, వయస్సు వేడిని అరికట్టలేక చీకటి తప్పులు చేసే స్త్రీలను సానుభూతితో గాక, సహానుభూతితో సృజించారు. అందుకే ఒక్కో పాత్ర, ఒక్కో కోణాన్ని సృజిస్తూ రవి కాంచని చోట, కవి కాంచునన్న వాక్యాన్ని నిజం చేస్తూ స్త్రీ హృదయపు లోతులను తన కలంతో స్పర్శించారు. మహిళల మనోభావాలను, మనోగతులను, మానవీయ కోణంలో దర్శించారు. ఆత్మాభిమానమున్న వనితలు ఎదుర్కునే అనేకానేక అంశాలను హృద్యంగా చిత్రీకరించారు. అన్నింటికన్నా మిన్నగా "పరిమితమైన ప్రేమ భావనలు" స్త్రీ, పురుష సంబంధాలలో ఆవిష్కరించారు. అన్ని స్త్రీ పాత్రల్లో ప్రస్ఫుటంగా ఆత్మాభిమానం, చదువు ఆవశ్యకత, ప్రశ్నించే గుణం, సమ భావన, ప్రేమ లేని పెళ్లిళ్ళు-పర్యవసనాలు, పురుష పెత్తనంతో పాటు వంట పని మహిళలోని శక్తియుక్తులను ఎంతగా కుంచించి

వేస్తుందో స్పష్టంగా చేప్పారు. "వంట చేయడాన్ని నిషేధించి పారేయాలి, దుకాణం నుంచి ఆహారం తెచ్చుకోవాలి. ప్రతి వీధికి ఒక దుకాణం ఉండాలి. కుటుంబం అక్కడికి వెళ్లి భోం చేయాలి. వంటా వార్పు చింతేగాక, శక్తి ఎంతో పొదుపవుతుంది. అంటారో సందర్భంలో. పొగచూరుల్లో మహిళలు ఎంతగా మగ్గుతున్నారో గ్రహించి తీవ్రంగానే దుయ్యబట్టడమే గాక పొదుపయ్యే శక్తి గూర్చి ప్రస్తావించారు.

స్త్రీల పట్ల సంఘం, సంస్కృతి చూపుతున్న చిన్న చూపు, వివక్ష వారిపై సాగుతున్న దౌష్ట్యాలకు ఆయన హృదయం చలించింది. అందుకే సమస్య మూలాలను సృజిస్తూ, సృష్టించిన స్త్రీ పాత్రలను ఓ సారి పరిశీలిద్దాం.

మధురవాణి

గురజాడ వారు సృజించిన మహిళామణులల్లో అగ్రగామి. వయస్సు, ఆలోచన, లలిత కళల ప్రవేశం, ప్రశ్నించేతత్వం, అన్యాయానికి గురవుతున్న సాటివారి పట్ల నైతిక బాధ్యత, అవసరమైతే ఏ స్థాయికైనా వెళ్ళి సమస్యను పరిష్కరించగలిగే నేర్పు. వేశ్య కులమంటేనే వెలివేయబడ్డ వారిగా పరిగణిస్తూ తమ పంచపాతకాలు అంటుకుంటాయన్నట్లు ప్రవర్తించే సభ్యసమాజంలో వారినే వెతుక్కుంటూ వెళ్ళే వ్యక్తుల నిజస్వరూపాలను నిగ్గదీస్తుందీ పాత్ర.

"ఆడదానికైనా, మగవాడికైనా ఓ నీతి ఉండొద్దూ" అంటూ వృత్తిరీత్యా వేశ్యగా జీవించినా, ఉన్నంత వరకూ ఒక్కరికే అంకితమైన వనిత. స్త్రీ శిథిలమవుతున్న ఓ వ్యవస్థకు ప్రతిరూపం. నూతన వెలుగు ప్రసరించబోతున్న కాలంలో వెలుగు రేఖల వైపు నడక సాగించిన నర్తకి. స్త్రీ స్వేచ్ఛకు, స్త్రీ విద్యకు ఓ వైపు వ్యతిరేకత ఎదురవుతున్న కాలంలోనే విద్యంటే కేవలం రాయడం, చదవడం మాత్రమే కాదని, వ్యవస్థ మనుగడకు ఉపయోగపడేది సముచితమైనది ఆచరణీయమేనని నిరూపించిన పాత్ర. వృత్తి చేత మలినమయినది శరీరం తప్ప, మనస్సు కాదని నిరూపించే వ్యక్తిత్వం. మధుర వాణి వాక్కుల్లో, చేష్టల్లో దురాచారాలను హేళన చేయడం, ఛాందస స్వభావాలను ఈసడించడం జరుగుతుంది. "డబ్బు తేలేని విద్య, దారిద్ర్య హేతువని సంగీతం, నాట్యం, అగ్రవర్ణాల వశమై, ఒళ్ళమ్ముకుని బతకమంటుంది ఈ సమాజం" అంటూ వాపోతుంది. కించిత్ కూడా భద్రత లేని జీవితాలను, శాశ్వతం కాని యవ్వనాన్ని జీవనాధారం చేసుకొనే కుటుంబాల్లో పుట్టినప్పటికీ మనసులేని శృంగారం, వలపులేని కౌగిలింతల కాఠిన్యం వద్దనుకుంటుంది. అందుకే గిరీశమైనా, రామప్పంతులైనా నచ్చితేనే నడక సాగించింది. నచ్చనప్పుడు తప్పుల్ని ఎత్తి చూపింది. సంఘంలో అనేకానేక వ్యాపారాలున్నాయి. అన్నింటి అంతిమ లక్ష్యం జీవనోపాధే! రేపటి కోసం భద్రతే! ప్రత్యామ్నాయ పరిస్థితులు కల్పించలేని సమాజ తీరు ఎంత వరకు సబబు? సమంజసం? ఇది కేవలం నాటి సమస్యే కాదు. నేటి సమస్య కూడా! నాడు ఓ కులం ప్రత్యేకించి ఇదే వృత్తిగా భావించి వృత్తి ధర్మంగా దారుణంగా దెబ్బ తింది. కానీ నేడు చాపకింద నీటిలా ఆ వృత్తి అంతటా విస్తరించింది. పట్టుబడనంత వరకూ అందరూ పెద్ద మనుష్యులే! నీతి వంతులే! నైతిక రక్షకులే! బయటపడితేనే అసలు గుట్టు రట్టయ్యేది! మధుర వాణి పాత్ర ద్వారా మరో విషయం కూడా చూడవచ్చు. వేశ్యగా వృత్తిరీత్యా దేహం మాత్రమే అమ్ముకుంటుంది. కానీ భార్య, ఇంటి చాకిరీ, అభిమానం, ఆత్మగౌరవం అమ్ముకుంటూనే భర్త కోరికను ఇష్టంగానో, కష్టంగానో భరిస్తుంది. కారణం అంతర్గతంగా ఉన్న అనేకానేక భయాలు.

వృత్తి హైన్యత తెలుసుకున్న మధురవాణి పాత్ర ద్వారా మనస్సుని తమ ప్రమేయం లేకుండా పుట్టిన కులంలో అనివార్యంగా ఆచరించాల్సిన వృత్తిపట్ల స్త్రీల హృదయాలు ఎలా స్పందిస్తాయో తెలియజేస్తున్న మధురవాణిలు ఈ సమాజంలో ఇంకా కనిపించడానికి కారణం మగవాళ్ళేనని ప్రస్ఫుటంగా తెలియజేస్తారు. కుల స్త్రీలు ఈసడించే వృత్తిగా చూపిస్తూనే వెలయాలు ఇంట వెలిగి వచ్చిన మగడిని భరించే స్త్రీలు మానవతులెలా అవుతారన్న ప్రశ్నను ఉద్భవింపజేస్తారు. కులం రీత్యా వేశ్యగా జన్మించడం తప్పు కాదని, వారిని సమాజంలో మరో వృత్తి స్వీకరించే అవకాశలివ్వక వేశ్యలను నిందించడం సమంజసం కాదని వేశ్య పాత్ర ద్వారా మానవత్వాన్ని గుర్తింపజేశారు గురజాడ వారు.

ముప్ఫైమూడు దృశ్యాల నాటకంలో మధుర వాణి కన్పించేది కేవలం ఎనిమిది దృశ్యాల్లోనే కాని మధుర వాణి పాత్రలేని 'కన్యాశుల్కం' ఊహించడం, చూడటం సాధ్యమా!

మధురవాణి పాత్ర ద్వారా వేశ్యల మనోభావాలను హృద్యంగా చూపుతూనే సమాజంలోని సహజ స్వభావాలను విభిన్న పాత్రలతో ఈసడింపజేస్తారు గురజాడ వారు.

మెటిల్డా

వయసు మళ్లిన భర్తతో జీవిస్తున్న వనితకు చుట్టూ ఉన్న కుర్రకారు వలన కలిగే అనుభవాలు సమస్యల పరంపరే ఈ పాత్ర. కిరస్తానీ పిల్ల, చదువొచ్చిన చిన్నది. బాల్యంలోనే వివాహమయ్యి అందం చందం లేని మొగుడితో భార్యాభర్తల మధ్య వయస్సు అసమానత్వం కలగజేస్తూ సమస్యలొక వైపు... ఆమె అందం వలన ఏ కుర్రాడు తన పడుచు భార్యతో సరసాలాడతాడోనని భయపడే అనుమానపు మనస్తత్వమున్న భర్త వైఖరి మరో వైపు... ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితుల్లో తన కాపురం కూల్చొద్దంటూ కుర్రాళ్ళకు ఉత్తరం రాయడం తెలిసిన భర్త... చదువరి అయిన తన భార్యకు మేధో సంబంధ సాహచర్యం గమనించి సాహితీ చర్చల్లోకి అనుమతించడం.. ఇవే పాత్ర లక్షణాలు ఈ పాత్రను క్షుణ్ణంగా పరిశీలిస్తే స్త్రీకి శరీరమే కాదు మనస్సు కూడా ఉంటుందని చెబుతాడు. మేధో మథనానికి సాహచర్యం లేకపోతే మహిళల్లో అసంతృప్తి అంతరాంతరాల్లో నిబిడీకృతమై పోతుంది. సంఘం, కుటుంబం గీసిన నిర్దిష్ట పరిధిలో నిలబడిపోవడం స్త్రీల అసహాయత్వం తప్పు, సహజత్వం కాదని నిరూపిస్తుంది. వయోభేదం ఆలు మగల మధ్య సృష్టించే మానసిక సమస్యలను చర్చిస్తుంది.

"ఇంటికి గడియ వేసుకో" అని భర్త హెచ్చరించగలడు గాని మనసుకు గడియలు వేయడం మగవారికి సాధ్యమవుతుందా స్వీయ నియంత్రణ లేకుంటే! ఒకవిధంగా మెటిల్డా కొంత అదృష్టవంతురాలు కారణం కిరస్తానీ జననం, చదువుకోగలిగే అవకాశం, మరీ చావుకు దగ్గరగా లేని భర్త, ఆఖరికి తన మానసిక అవసరం అర్థం చేసుకున్న వ్యక్తి భార్యగా ఎంతో కొంత మెరుగైన జీవితాన్ని ఆనాటి సమాజంలోని ఎంతో మంది కన్నా పొందగలగడం. భార్య మనస్సులో స్థానం పొందడమే మగవాడి అసలైన విజయమని మెటిల్డా పాత్ర ద్వారా సమాజానికి తెలియజేశారు కవిశేఖరుడు.

పూర్ణమ్మ

పెద్ద కుటుంబంలో ప్రేమగా అన్నదమ్ముల వదినెల మధ్య ఎదిగిన ఓ చిన్నారి తల్లిదండ్రులు బిగింపజేసిన పసుపుతాడు, పలుపు తాడుగా మారిన సమయాన ముసలి భర్తతో సంసారం ఊహించడానికే వీలుగాని వేదనను ఎవ్వరితో పంచుకోలేక బతుకుని దుర్భరం చేసుకొని అనుక్షణం చస్తూ బతకలేక కొలనులో మునిగి తనువును చాలించిన బాల.

బుచ్చమ్మ

కాసుల కక్కుర్తితో తండ్రి ముదుసలి అల్లుడిని తెచ్చే సమయంలో... తన భార్యతో సంసార జీవితాన్ని ఆనందించిన ఆ వ్యక్తే అలాంటి జీవితాన్ని తన బిడ్డకు కల్పించడం గుర్చి ఆలోచించలేదు. లోపం ఎవ్వరిది! ప్రపంచాన్ని ఆవరించి ధన, వస్తు వ్యామోహంలో కొట్టుకుపోతున్న మానవ ప్రవృత్తిదా? ఆడదానికి వయస్సు, మనస్సు ఏమిటనుకునే పురుషాధిక్యతదా?

అందరూ కూర్చుని నవ్వే వేళ, నన్నొకసారి పరితలచండని పూర్ణమ్మ పాత్ర ద్వారా పలికిస్తారు. తనను గురుతు పెట్టుకోవా లన్న కాంక్ష కాదక్కడ. తనలా మరో బాలిక బాల్యాన్ని కోల్పోకూడదని, వయస్సులేని భర్త సరసన భార్యగా నిలవకూడదని, ముదసలి భర్తతో కాపురం, పిల్లలు రెండూ కల్లలేనని, ఆ ఘోరానికి మరో బిడ్డ బలి అవ్వకూడదన్న తపన కన్పించే పాత్ర 'పూర్ణమ్మ'ది.

మెటిల్డా

కన్యక

స్త్రీకి శరీరంతోపాటు మనస్సు కూడా ఉంటుందని మనుగడ సాగించడం కష్టమనిపించిన సమయంలో మరణం ఓ లెక్క కాదని నిరూపిస్తుంది నాయిక. వివాహ వ్యవస్థలో స్త్రీల అసమ్మతిని ఆత్మాభిమానాన్ని పరిస్థితులు విషమించినపుడు తీసుకునే నిర్ణయాన్ని ప్రస్ఫుటింపచేస్తుంది. కామాంధుడైన రాజు పాలబడకుండా రాజు బలం, అధికారం ఎదురించలేనిస్సహాయత. కన్యక మరణం కథ రీత్యా ఆత్మహత్య ... కానీ రాజులోని దుర్మార్గ మనస్తత్వానికి మరణ శాసనం. మనిషిని చంపడం కాదు. మృగత్వాన్ని చంపడం అని నిరూపించిన పాత్ర. ఈ పాత్ర స్వభావం ఆ కాలానికి సరిపోయింది. 68 సంవత్సరాల స్వాతంత్ర్య పర్వంలో అత్యాచార భారతం అవిఘ్నంగా సాగుతోంది. కారణం. సమాజంలోనూ, చట్టాలలోనూ వున్న డొల్లతనం. సాక్ష్యాలు కోరే న్యాయ వ్యవస్థలో మహిళలు ఆత్మాహుతికి పాల్పడడం కన్నా మానసికంగా హత్య చేయబడుతున్నారు. ఆత్మాభిమానాన్ని నిలుపుకోవడానికి తమదైన శైలిలో తంటాలు పడుతూనే వున్నారు. కన్యక ద్వారా గ్రహించవలసిందేమంటే అందం, ఆస్తి, వైభవం, అధికారం కన్నా ఆడవాళ్లు కోరుకునేది మానసిక అనుబంధం. రూపం లేకున్నా కలిగే భావ పరంపర సంతోషం, మానసిక ఐక్యత. అవి లోపిస్తే ఏ బంధమైనా వ్యర్థమే.

పూటకూళ్లమ్మ

కుటుంబపరంగా జరిగిన అన్యాయం, బాల్యంలోనే వైధవ్యాన్ని అందివ్వగా జీవనాధారం కోసం ఆర్థిక స్వావలంబన సాధించుకునే పాత్ర. చేతనైన విద్య వంట చేయడం. ఒక్కతే ఇంటా బయటా సమర్థించుకోవడం ఆనాడే కాదు. నేడూ కష్టమే. అందుకే అండదండగా వుంటాడని 'గిరీశాన్ని నమ్మింది'. ఏం చేశాడు గిరీశం? పూటకూళ్లమ్మ ఇంట ప్రవేశించి ఆమెతో అవసరాలు తీర్చుకుంటూ కడుపు నింపుకుంటూ నిండా ముంచాడు. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతున్న తీరున పూటకూళ్లమ్మకు తెలియదనుకుంటూ మధురవాణితో సరససల్లాపాలు సాగించాడు. డబ్బుతో ఉడాయించి ఆశ్రయాన్ని పోగొట్టుకోవడం

ఇంట్లోనే కాదు. పూటకూళ్లమ్మ మనస్సులో, మధురవాణి మనస్సులో సైతం.

ఆత్మస్థైర్యానికి, స్వావలంబనకు, ఆర్థిక స్వాతంత్ర్యానికి ప్రతీకగా చూపుతూనే మగవారి చేతిలో అమాయకంగానో, ఇష్టంగానో మోసపోయే మహిళల ప్రతినిధి పూటకూళ్లమ్మ... చీపురు కట్టతో గిరీశాన్ని ఉతికి గెంటేసే పాత్ర ద్వారా, ఆడవారికి కోపమొస్తే మగాళ్ల పరిస్థితిని ప్రకటించారు.

సరళ

వేశ్య వృత్తి నిర్మూలనకు మార్గం ప్రత్యామ్నాయ జీవనోపాధి. వారిని వివాహం చేసుకుని భర్తగా సమాజం ముందు గౌరవనీయ స్థానంలో నిలబడగలిగే వ్యక్తి సాహచర్యాన్ని రంగనాథ అయ్యర్ తారసపడినప్పుడు ఊహించలేదు. సౌందర్యం–శాస్త్రీయ సంగీత పరిజ్ఞానమున్న తనలాంటి వారిని ఆరాధించే వ్యక్తులు శారీరక సౌందర్యోపాసకులు తప్ప... జీవన సహచరులు కాలేరని. ప్రేమ వేరని, పెళ్లి వేరని తెలుసుకోవడం సులభం కాదని. లోకం మరమ్మతు కోసం మోహం ఎత్తుకు బ్రతుకుతున్నామంటూ ఆత్మవంచన చేసుకునే అయ్యర్లు ఆనాడే కాదు నేడూ మన సమాజంలో కోకొల్లలు. ఎవరో రావాలి. ఏదో చేయాలి అన్న మాటలు తప్ప తమకు తాముగా ఏం చేయగలరు అన్నదే అసలైన ప్రశ్న. సరళ ఆలోచనున్న వేశ్య...అందుకే ప్రశ్నించగలిగింది.

బాల వితంతువు బుచ్చమ్మ

గురజాడ వారి అభిమాన పాత్ర ఇది. అమాయకత్వం తప్ప లోకజ్ఞానం లేని బాల వితంతువు. తల్లీదండ్రీ, తోబుట్టువులు తప్ప మరో ప్రపంచం ఎరుగని జీవి. భర్త తరపున వచ్చిన ఆస్తి విలువ తెలియని అమాయకురాలు. తనలాగా తన చిన్నారి చెల్లి జీవితం మోడు వారి పోకూడదని భావించే సహోదరి. అందుకే తనకొచ్చిన ఆస్తినిచ్చి వయసులో వున్న యువకుడిని అల్లుడిగా తెచ్చుకొమ్మని తండ్రికి అవసరమైనప్పుడు ఎదురు చెప్పే అక్క. గిరీశం ఎంతగా కవ్వించినా లొంగని అభిమానధనురాలు. తన చెల్లి భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయం తీసుకొన్న వనిత. వైధవ్యం, అందునా బాల వితంతువు ఇక్కట్లు స్వానుభవంతో ఎరిగిన యువతి. తన సమస్య మరొకరికి సంభవించకూడదన్న స్వభావమున్న వనిత.

మీనాక్షి

తన ప్రమేయం లేకుండా వైధవ్యం బాల్యంలోనే సంభవించి హార్మోన్ల ప్రభావంతో పదే పదే చీకటి తప్పులు చేసిన మీనాక్షి నిజంగా దోషేనా? కూతురి వైధవ్యానికి కారణం కుటుంబం కాదా? లైంగికత సహజమైనప్పుడు, భార్యతో సంసార జీవితం అనుభవిస్తున్న తండ్రి, అన్నలు మొదలగు కుటుంబ సభ్యులు మీనాక్షి పరిస్థితిని ఎందుకు అర్థం చేసుకో లేకపోయారు? మీనాక్షితో శారీరక సంబంధం పెట్టుకున్న పురుషుడు దోషి కాదా? ప్రకృతికి ఎదురీదాలంటే ఎంత సాధన, మనోబలం కావాలి స్త్రీకైనా? పురుషుడికైనా? సమాజ గమనంలో మనుషులు ఏర్పరుచుకున్న నియమావళి, మగువ విషయంలో ఎంత నిర్దయగా ఉందో చాటారు మహాకవి.

వెంకమ్మ

భర్త మాటకెదురీదలేక, కూతుళ్ల వైధవ్యం భరించలేక అన్నను, ఆత్మహత్యా ప్రయత్నాన్ని ఆశ్రయించిన ఓ నిస్సహాయ మాతృమూర్తి.

కమలిని

భర్తను మార్చుకునే తపనున్న మహిళ.

ఈ పాత్రలన్నీ ఆనాటి సమాజంలోని స్త్రీల జీవితాలకు నిలువెత్తు సాక్ష్యాలు. అన్నింటా సుస్పష్టంగా కన్పించేది ఒక్కటే... మగువల పట్ల మానవ సమాజం వ్యవహరించిన నిర్దయ వలన బలవుతున్న స్త్రీల వ్యథాభరిత జీవితాలు. తమ ప్రమేయం లేకుండా పుట్టి, తమ ఇష్టాలకు వ్యతిరేకంగా కన్యాశుల్కానికి అమ్ముడయిన బాలవితంతువుల జీవన వ్యథ, అసమాన వయోభేదాల అవస్థలు. భర్త ఎటువంటి వాడైనా భరిస్తూ, వాడిని మార్చుకోవడానికి స్త్రీలు పడే రకరకాల అవస్థలు. స్త్రీలకు స్త్రీలే శత్రువులన్నట్లుగా వ్యవహరించే సమాజంలో వేశ్యల జీవితాలు, భర్త వేశ్యాసాంగత్యాన్ని భరిస్తూ సంసారం సాగించే వారు బ్రాహ్మణ బాలికైనా, కిరస్తానీ యువతి అయినా భారతీయ సమాజం స్త్రీల పట్ల విధించిన చిత్రవిచిత్ర ఆంక్షలతో మగ్గిన మహిళల సమస్యలు.

సమాజ గమనంలో, జోడెడ్ల బండిలా జీవితాలు సాగాలంటే మగవాడూ, మగువ సరిసమాన స్థాయిలో ఉండాలని, ఒంటెద్దు పోకడ అసంపూర్ణ జీవితాలకు నాంది అని నిరూపించారు గురజాడ. మహిళ మేల్కొంటేనే సమాజాభివృద్ధి అని తన రచనలతో సమాజాన్ని చైతన్యపరిచి జీవన సార్థకత చేకూర్చారు అప్పారావు గారు.

అయితే ఆయన ఊహించిన ఆధునిక మహిళ, నాటి నుండీ నేటి వరకూ కొంత వరకూ పురోగమించింది. గమ్యం సాగుతుంది కానీ గమనం మందకొడిగా ఉంది. కారణం ఎదుగుతున్న క్రమంలో ఎదురవుతున్న సాంఘిక అవరోధాలు. ఆధిపత్య భావజాలంతో అహంకారపూరిత ధోరణులతో అడుగడుగునా సమస్యలు సృష్టించేది కొందరు కాగా, ఎదిగినవారిని కళ్లెత్తి చూడలేని మానసిక అంధత్వం. మహిళల ప్రగతిని, అభివృద్ధిని కోరని అధికార గణం, మహిళా ఓటు బ్యాంకు కావాలి కానీ, మహిళా అధికారం వద్దనే రాజకీయ నాయకులు, పార్టీలు.

వెలుతురుంటే నీడ ఉంటుంది. చీకట్లో సైతం వెన్నంటి ఉండేది ఆత్మస్థైర్యం... అదే ఆధునిక మహిళ అసలైన స్వరూపం. అందం కన్నా ఆత్మవిశ్వాసానికి, ఆర్థిక స్వాతంత్ర్యానికి, భావ ప్రకటనకు స్వేచ్ఛ ఉన్న మహిళే అసలైన ఆధునిక మహిళ. ఆమె కవిశేఖర గురజాడ అప్పారావు గారు కాంచిన మహోన్నత ఆధునిక మహిళా స్వరూపం. ✦

పూర్ణమ్మ

క్యాప్సికంతో కమ్మగా...

ఆమ్లెట్

కావాల్సిన పదార్థాలు

క్యాప్సికం-ఒకటి, గుడ్డు (తెల్ల) సొన-రెండు టేబుల్ స్పూన్లు, మిరియాలపొడి- అర టీ స్పూను, పసుపు-చిటికెడు, ఉప్పు-రుచికి తగినంత, అల్లం తరుగు- ఒక టీ స్పూను, నూనె- ఒక టేబుల్ స్పూను.

తయారీ

క్యాప్సికంను సన్నని ముక్కలుగా తరగాలి. ఒక పాత్రలో గుడ్డు తెల్ల సొన, మిరియాల పొడి, అల్లం, క్యాప్సికం తరుగు, ఉప్పు, పసుపు వేసి బాగా గిలకొట్టి పెనంపైన ఆమ్లెట్ వేసి మాడకుండా సన్నని మంటపై దోరగా వేయించుకోవాలి. అన్నంలో నంజుకోవడానికి ఈ ఆమ్లెట్ వెరైటీ రుచితో చాలా బాగుంటుంది.

బోండాలు

కావాల్సిన పదార్థాలు

బేబీ క్యాప్సికం-10, ఆలు-4, ఉల్లిపాయ తరుగు-ఒక కప్పు, అల్లం తరుగు-ఒక టీ స్పూను, పచ్చిమిర్చి తరుగు-ఒక టీ స్పూను, పుదీనా తరుగు-అర కప్పు, ఉప్పు-రుచికి సరిపడా, శనగపిండి-ఒక కప్పు, వాము- అర టీ స్పూను, నూనె- వేయించడానికి సరిపడా, నిమ్మరసం-ఒక టేబుల్ స్పూను

తయారీ

ఆలుని మెత్తగా ఉడికించి తొక్క తీసి మెదపాలి. కడాయిలో ఒక టేబుల్ స్పూను నూనె వేసి ఉల్లి, అల్లం, పచ్చి మిర్చి, పుదీనా తరుగుల్ని వేగించాలి. మెదిపిన ఆలు, తగినంత ఉప్పు కూడా కలిపి దించి, చల్లారాక నిమ్మరసం చల్లాలి. శనగపిండిలో వాము చిటికెడు ఉప్పు వేసి తగినంత నీటితో చిక్కగా కలుపుకోవాలి. క్యాప్సికం తొడిమల్ని, లోపలి గింజల్ని తీసేసి అందులో ఆలు మిశ్రమాన్ని కూరి, శనగపిండి జారులో ముంచి నూనెలో దోరగా వేగించాలి. ఈ బోండాలు టమోటో సాస్‌తో చాలా రుచిగా ఉంటాయి.

గుత్తికూర

కావాల్సిన పదార్థాలు

మీడియం సైజు క్యాప్సికం-ఆరు, శనగపిండి- రెండు స్పూన్లు, ఉల్లి తరుగు-ఒక కప్పు, పసుపు-పావు టీ స్పూను, కారం- అర టీ స్పూను, ధనియాల పొడి-అర టీ స్పూను, నిమ్మరసం-ఒక టేబుల్ స్పూను, ఉడికించి మెదిపిన ఆలు గుజ్జు-ఒక కప్పు, ఉప్పు-రుచికి తగినంత, నూనె-రెండు టేబుల్ స్పూన్లు

తయారీ

అర టేబుల్ స్పూను నూనెలో ఉల్లి తరుగు వేయించి అందులోనే పసుపు, ధనియాల పొడి, ఉప్పు, శనగపిండి, కారం కలిపి మరో ఐదు నిమిషాలు వేయించాలి. చల్లారాక నిమ్మరసం కలపాలి. క్యాప్సికం గింజల్ని తీసి అందులో శనగపిండి మిశ్రమాన్ని సగం దాకా కూరి మిగతా భాగం ఆలుతో మూసేయాలి. పాన్‌లో నూనె వేసి సన్నని సెగమీద అన్ని వైపులా తిప్పుతూ క్యాప్సికం ఉడికేదాకా వేయించుకోవాలి. ఇవి అన్నంతో కలుపుకోవడానికి సాంబా రన్నంతో నంజుకోవడానికి చాలా బాగుంటాయి.

రుచి

చికెన్

కావాల్సిన పదార్థాలు

బోన్‌లెస్ చికెన్- అర కేజీ, క్యాప్సికం- రెండు, పెరుగు- అరకప్పు, పసుపు-పావు టీ స్పూను, ఉల్లి తరుగు-అర కప్పు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక టీ స్పూను, ఉప్పు-రుచికి తగినంత, కారం-ఒక టీ స్పూను, పచ్చిమిర్చి - రెండు, కొత్తిమీర తరుగు- అర కప్పు, మసాలా పొడి-అర టీ స్పూను, నూనె-రెండు టేబుల్ స్పూన్లు

తయారీ

ఒక పాత్రలో చికెన్, పెరుగు, అల్లం వెల్లుల్లి పేస్టు, కారం, పసుపు, ఉప్పు వేసి బాగా కలిపి గంటసేపు పక్కనుంచాలి. కడాయిలో నూనె వేసి పచ్చిమిర్చి ఉల్లి తరుగు దోరగా వేగాక చికెన్ మిశ్రమం వేసి సన్నని మంటపై ఉడికించాలి. చికెన్ మెత్తబడ్డాక క్యాప్సికం ముక్కల్ని వేసి కలపాలి. పది నిమిషాల తర్వాత మసాలా పొడి, కొత్తిమీర చల్లి దించేయాలి. ఇది అన్నంలోకి పరాటాల్లోకి బాగుంటుంది.

ప్రత్యేకం

నిద్రలో రెండు గ్రామాలు

నిద్ర నుంచి బయట పడిన వారు పీడకలలు, ఫాంటసీలను చెప్పారు. కొందరికి అసలు ఏం జరిగిందో కూడా తెలియలేదు. ఏదో బ్రెయిన్ స్విచాఫ్ అయిన భావన కలిగినట్టుందని వివరించారు.

బైక్ తోలుతూ హఠాత్తుగా నిద్రలోకి జారిపోతారు. తరగతిలో అంతా ఒకేసారి కునుకు తీస్తారు. రోజుల పాటు వీధి వీధంతా మత్తులో జోగుతుంది కజకిస్తాన్‌లోని రెండు గ్రామాల్లో. ఉన్నట్టుండి నిద్ర పట్టేసి ఆరురోజుల వరకు మేల్కోరక్కడ. ఒకరు కాదు ఇద్దరు కాదు వందల మంది ఈ అంతుబట్టని నిద్ర రోగంతో సతమతమవుతున్నారు.

రాజధాని అస్తానా నగరానికి 300 కిలో మీటర్ల దూరంలో ఉన్న అందమైన గ్రామాలే కలాచి, క్రాస్నోగార్స్క్. ఒకప్పుడు వేలాది మంది యురేనియం గని కార్మికుల కుటుంబాలతో కళకళలాడిన ఈ ప్రాంతాలు ఆ తర్వాత గనులు మూతబడి కాస్త పలుచబారాయి. అయినా ఇంకా అక్కడ సుమారు 840 మందికి పైగా జనాభా ఉన్నారు. మనోహరమైన ప్రకృతి దృశ్యాలతో పర్యాటక ప్రదేశాల్లా కనిపించే ఆ గ్రామాల్ని రెండేళ్ల క్రితం నుంచి ఓ అరుదైన వ్యాధి పీడిస్తోంది. తొలుత 2010 ఏప్రిల్‌లోనే తొలి కేసు నమోదైనా 2013 మార్చి నుంచి మాత్రం ఇది ఒక్కసారిగా విజృంభించింది. ఒక్కసారిగా పదుల మంది రోజుల తరబడి నిద్రావస్థలోకి జారిపోతున్నారు. పిల్లల దగ్గర నుంచి పెద్దల వరకు ఈ రకంగా కోమా పరిస్థితిలోకి వెళుతున్నారు. నిద్ర నుంచి మెళకువ వచ్చాక చాలా మందికి మతి మరుపు వస్తోంది. వాంతులు, తలనొప్పితో పాటు చిత్త భ్రమలకు కూడా లోనవుతున్నారు. కొందరిలో నిద్రకు ముందు గుండె వేగం అమాంతం పెరిగిపోతోంది. నిద్ర కూడా చాలా విచిత్రంగా వస్తోంది. పనుల్లో పడిపోయిన వారు హఠాత్తుగా మత్తుతో జోగుతున్నారు. వాహనాలు నడిపే సమయంలోను, ఏదైనా బరువు పనులు చేస్తున్న సమయంలోను కూడా నిద్ర పట్టేస్తోంది. నిద్ర నుంచి బయట పడిన వారు పీడకలలు, ఫాంటసీలను చెప్పారు. కొందరికి అసలు ఏం జరిగిందో కూడా తెలియలేదు. ఏదో బ్రెయిన్ స్విచాఫ్ అయిన భావన కలిగినట్టుందని వివరించారు. ఒకసారి దీని బారిన పడిన వారు మళ్లీ మళ్లీ నిద్రలోకి వెళ్లడం మామూలైంది. కొందరు ఏకంగా ఆరు సార్లు ఆరు రోజుల చొప్పున నిద్రపోయిన సందర్భాలున్నాయి. దీనికి కారణం తెలీక 'ఎన్‌సెఫలోపతి ఆఫ్ అన్‌నోన్ ఆరిజన్' అని ఓ రకమైన మెదడు సమస్యగా వైద్యులు కేస్ స్టడీల్లో రాసుకున్నారు. ఇలా రెండు గ్రామాల్లో కలిపి 150 మందికి పైగా బాధితులున్నారు. ఇదో సంచలనమై ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వైద్యనిపుణులు, శాస్త్రవేత్తల బృందాల దృష్టి ఆ గ్రామాలపై పడింది. విపరీతమైన మీడియా కవరేజీ వల్ల ఆ నిద్రకు కారణం ఏలియన్లు, దెయ్యాలు, పారా నార్మల్ యాక్టివిటీ వంటి ఎన్నో కట్టుకథలు పొక్కాయి. అయితే ఈ రెండు గ్రామాలు ఒకప్పుడు సోవియట్ రష్యా యురేనియం అవసరాల్ని తీర్చేవి. యురేనియం పుష్కలంగా దొరకడంతో మైనింగ్ పెద్ద ఎత్తున సాగింది. ఆ తర్వాత గనులు మూతబడటంతో చాలా కుటుంబాలు ఆ గ్రామాల్ని విడిచివెళ్లాయి. మిగిలిన కుటుంబాల్లో జర్మన్లు, రష్యన్లే ఎక్కువ. ఒకవేళ ఈ యురేనియం గనుల రేడియేషన్ కారణంగానే ఇలా వికారం, విచిత్రమైన నిద్రావస్థలోకి వెళుతున్నారేమోనని భావించారు. సుమారు ఏడు వేల భవంతుల్లో రేడియేషన్‌ను కొలిచారు. కానీ ప్రమాదకర స్థాయిలో ఏమీ లేదని తేలడంతో పెద్ద ప్రశ్నగా మిగిలింది. ఈ చిక్కుముడిని విప్పేందుకు వెళ్లిన శాస్త్రవేత్తలు గానీ, జర్నలిస్టులు గానీ, సందర్శకులు గానీ ఎవరూ కూడా ఇలా ఈ నిద్రా వ్యాధికి గురైన సందర్భం లేకపోవడంతో అనుమానాలు ఎక్కువయ్యాయి. అంతకు ముందు 2002లో అమెరికాలో టెర్రరిస్టు దాడులు పెరిగిపోయి పిల్లల్లో భయభ్రాంతులు ఎక్కువై ఓ రకమైన ర్యాష్ చాలామంది పిల్లల్లో కనిపించింది. దీన్ని బిన్ లాడెన్ ఇచ్ అని పిలిచేవారు. ఈ తరహాకు చెందిన మాస్ సైకోసిస్ అయ్యే అవకాశముందని కొందరి వాదన. జనాల్లో ఈ నిద్రావస్థపై అతి ఆలోచన పెరిగి క్రమంగా అది చాలామందిలో ఓ లక్షణంగా కనిపించి ఉంటుందనే ఈ వాదనను కొట్టిపారేశారు శాస్త్రవేత్తలు. దేశ ప్రధాని, అధ్యక్షుడు వంటి వారు ప్రత్యేక శ్రద్ధ పెట్టి అంతర్జాతీయ నిపుణుల్ని పిలిపించి పరిశోధనలు సాగించారు. ఇప్పటి వరకు 20 వేల వరకు ప్రయోగశాల, చికిత్సా పరీక్షలు జరిపారు. కొందరి పరిశోధనల్లో తేలిన విషయం అక్కడ గాలిలో కార్బన్ మోనాక్సైడ్, హైడ్రో కార్బన్లు సాధారణం కన్నా పదిరెట్లు ఎక్కువగా ఉన్నాయని తేలింది. ఆక్సిజన్ శాతం చాలా తక్కువగా ఉండటం కూడా ఇలా బ్రెయిన్ స్విచాఫ్ అవడానికి కారణంగా పరిగణిస్తున్నారు. కానీ స్థానికుల వాదన మరోలా ఉంది. అరుదైన ఖనిజ సంపద ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో వజ్రాల వంటి ఏవైనా అతి విలువైన ఖనిజాల జాడ ఉండొచ్చని వాటిని వెలికితీసేందుకు అడ్డుగా ఉన్న తమపై ఎవరో కావాలని విషప్రయోగం చేస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు.

ముంబై 'భాయ్'లు

ముంబై అనగానే మాఫియా సామ్రాజ్యం...దాన్ని ఏలిన డాన్లూ... వారు చేసిన చట్ట వ్యతిరేక కార్యక్రమాలూ గుర్తురాక మానవు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని నేరాలకు పాల్పడడం వీరికి మంచినీటి ప్రాయం. గత నెల ఇండొనేషియా బాలిలో చోటా రాజన్ అరెస్టు ... చీకటి సామ్రాజ్య ముఖ్య ఘట్టాల్లో ఒకటిగా నిలవదగిన ఘటన. రాజేంద్ర సదాశివ్ నికల్జే అలియాస్ చోటా రాజన్ వెనక కూడా ఒక బాలీవుడ్ చిత్రం తీయడానికి కావాల్సిన కథ వుంది. 1970లో సినిమా థియేటర్ల దగ్గర దొంగ టికెట్లు అమ్ముకునే నికల్జే ... ఆ తర్వాత బడారాజన్ ముఠాకు సాయంగా చిన్న చిన్న నేరాలు చేసేవాడు. ప్రత్యర్థి చేతిలో బడారాజన్ హతుడవడాన్ని జీర్ణించుకోలేకపోయిన అతను ఆ హత్యకు కారకుడైనవాణ్ణి చంపేసి చోటా రాజన్‌గా పేరు సంపాదించుకోవడమే కాదు! అతని స్థానాన్నీ ఆక్రమించుకున్నాడు! ఇటువంటి నిజజీవిత పాత్రలు ముంబైలో ఎన్నో వున్నాయి. కథలూ, కల్పితాలూ, వాస్తవాలు కలగలపిన పుస్తకాలు, సినిమాలూ అనేకం వచ్చాయి. వాటిలో కొన్ని...

కరీం లాలా

కరీం లాలా ముంబై నగరంలో తొలి మాఫియా డాన్ అని చెప్పవచ్చు. తల్లిదండ్రులు అతనికి పెట్టిన పేరు అబ్దుల్ కరీమ్ షేర్ ఖాన్. ఆఫ్ఘనిస్తాన్‌లో పుట్టాడు. 1930లో ముంబై వచ్చి ఓ గ్యాంగ్‌ను నడుపుతూ తనదైన శైలిలో వివాదాలను పరిష్కరించేవాడు. జూదశాలలూ నడిపేవాడు. బంగారం, వెండి, ఎలక్ట్రికల్ వస్తువులను దొంగ రవాణా చేసేవాడు. హాజీ మస్తాన్, వరదరాజన్ ముదలియార్‌తో చేతులు కలిపి చట్టవ్యతిరేక కార్యకలాపాలను విజయవంతంగా పూర్తి చేస్తుండేవాడు. 1970ల వరకు ముగ్గురూ కలిసి ముంబైని ఏలారని చెప్పవచ్చు. తన మేనల్లుడు సమద్ ఖాన్‌ను 1985లో దావూద్ ఇబ్రహీం చంపించడంతో చీకటి ప్రపంచంలో లాలా ప్రాభవం తగ్గుముఖం పట్టింది. నిజానికి ఇబ్రహీం సోదరుణ్ణి లాలా చంపాలని చూసినందుకే అతను ఇలా ప్రతీకారం తీర్చుకున్నాడన్న కథనమూ వుంది. 'జంజీర్' చిత్రంలోని ప్రాణ్ పాత్ర లాల్ జీవితాధారంగా సృష్టించబడినదే. 90 ఏళ్ల వయసులో 2002లో ముంబైలో చనిపోయాడు లాలా.

వరదరాజన్ ముదలియార్

కమల్‌హాసన్ 'నాయకన్' చిత్రం వరదరాజన్ జీవితం మీదే తీసినదంటారు. వరదరాజన్ ముదలియార్ తమిళనాడులోని రేవు పట్టణమైన టుటికోరన్ నుంచి ముంబై చేరుకొని పోర్టర్‌గా జీవితం ఆరంభించాడు. అక్కడ మస్తాన్ సాయంతో ఓడల్లోని సరకును కాజేసి అమ్మేవాడు. ఆ దొంగ సొత్తుతోనే కాక, చట్టవ్యతిరేక కార్యకలాపాల ద్వారా ఆర్జించిన డబ్బుతో, మాతుంగ, ధారావి, సియోన్ కోలివాడలోని పేద తమిళులకు సాయపడుతూ నాయకుడి అవతారమెత్తాడు. ప్రభుత్వం అతని ముఠాను ఏరిపారేయడంతో తిరిగి 1980 మధ్యలో చెన్నై చేరుకున్నాడు. అక్కడే 1988లో చనిపోయాడు.

అబూ సలేం

ఉత్తర ప్రదేశ్‌లోని ఆజమ్‌గఢ్ జిల్లా ఇతనిది. మొదట్లో ఢిల్లీలో ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేసేవాడు. తర్వాత అక్కడి నుంచి ముంబై చేరుకున్నాడు. అంధేరిలో టెలిఫోన్ బూత్ నడుపుతూ చిన్న చిన్న నేరాలు చేసేవాడు. 1980లో దావూద్ ఇబ్రహీం సోదరుడితో పరిచయమై వారి పనులు చేసిపెట్టేవాడు. 1993 ముంబై బాంబు పేలుళ్ల నిందితుడిగానే కాక రాజీవ్ రాయ్, సుభాష్ ఘై వంటి బాలీవుడ్ నిర్మాతలను బెదిరించి భారీగా డబ్బు దండుకునేవాడిగా పేరు. మ్యూజిక్ మాంత్రికుడు గుల్షన్ కుమార్ హత్య వెనక కూడా ఇతని ప్రమేయమున్నట్టు ఆరోపణలున్నాయి. తన ప్రియురాలు, నటి అయిన మోనికా బేడీతో కలిసి 2002లో లిస్బన్‌లో అరెస్టయ్యాడు. 2005లో అధికారులు అతన్ని భారత్ చేర్చారు. ఎట్టకేలకు బిల్డర్ ప్రదీప్ జైన్‌ను హత్య చేసినట్టు ఈ ఏడాది ప్రారంభంలో అంగీకరించాడు.

హాజీ మస్తాన్

తొలితరం మాఫియా డాన్ల త్రయంలో ఒకడిగా ఇప్పటికీ వార్తల్లో వున్న వ్యక్తి హాజీ మస్తాన్. ఎనిమిదేళ్ల వయసులో 1934లో మస్తాన్ తన తండ్రితో కలిసి ముంబై చేరుకున్నాడు. పదేళ్ల తర్వాత పోర్టు కూలీగా జీవితం ఆరంభించాడు. తర్వాత బంగారు బిస్కెట్లు, వాచీలు, ట్రాన్సిస్టర్లు దొంగ రవాణా చేసేవాడు. అనంతరం కల్తీ సారా వ్యాపారంలోకి దిగాడు. మలబార్ హిల్‌లోని ఇల్లు, ఇతరత్రా విలాసాలు అతను ఎంతగా డబ్బు పోగుచేశాడో చెప్పకనే చెప్పేవి. లాలా, ముదలియార్‌తో అతనికున్న అనుబంధం కూడా చీకటి సామ్రాజ్యంలో అతని ఎదుగుదలకు కారణమైంది. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే ఈ ముగ్గురూ ముంబైలోని మూడు ప్రాంతాల మీద పెత్తనం చేశారనుకోవాలి. 1970లో ఎమర్జన్సీ సమయంలో అతన్ని అరెస్టు చేయడంతో నేర సామ్రాజ్యంలో అతని ప్రాభవం క్షీణించిందనుకోవాలి. 1994లో చనిపోయాడు. 'దీవార్'లో అమితాబ్ బచన్, ఆ తర్వాత 'వన్స్ అపాన్ ఎ టైమ్ ఇన్ ముంబై'లో అజయ్ దేవగన్ పాత్రలకు మూలం ఇతని నేరపూరిత జీవిత ఘట్టాలే.

అరుణ్ గావ్లి

'అరుణ్ గావ్లి'గా నేరచరితను ఆరంభించక ముందు అతని పేరు అరుణ్ గులాబ్ అహిర్. సెంట్రల్ ముంబైలో పాల వ్యాపారం చేసేవాడు. 1980ల్లో రామా నాయక్‌తో అయిన పరిచయం దావూద్ ఇబ్రహీం పనులకు సహకరించడానికి ఉపయోగపడింది. పోలీసుల చేతుల్లో నాయక్ హతుడవడంతో ఇతను రాజకీయాల్లోకి దిగాడు. సొంతగా రాజకీయ పార్టీని స్థాపించి ఎమ్మెల్యే అయ్యాడు. అయితే 2007లో ఓ కార్పొరేటర్‌ని హత్య చేయడంతో...జైలు పాలై... ఊచలు లెక్కిస్తున్నాడు.

దావూద్ ఇబ్రహీం

ముంబై డాన్లందరిలో ఎక్కువ పేరు, గుర్తింపు కలిగిన వాడు దావూద్ ఇబ్రహీం. ఇతని తండ్రి పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేసేవాడు. అయితే అప్పట్లో డాన్‌గా ఒక వెలుగు వెలుగుతున్న హాజీ మస్తాన్ చేతిలో తండ్రి వేధింపులకు గురికావడాన్ని చూసి ఓర్చుకోలేకపోయేవాడనీ... అంతకన్నా పెద్ద డాన్ కావాలని కలలు కన్నాడనీ అంటారు. పోలీసుల సాయంతో ముందుగా కరీమ్ లాలా ముఠా సభ్యులను ఏరిపారేశాడు. హవాలా వ్యాపారంతో తన చీకటి సామ్రాజ్యాన్ని విస్తరించాడు. 1993 ముంబై పేలుళ్ల పథకాన్ని రచించడంతో పోలీసుల దృష్టిలో 'మోస్ట్ వాంటెడ్' అయ్యాడు. 1984లో ఇతను దుబాయ్ పారిపోయి...అటునుంచి పాకిస్తాన్ చెక్కేసి...ప్రస్తుతానికి అక్కడే ఐఎస్ఐ సాయంతో తలదాచుకుంటున్నాడని కథనాలు వెలువడుతున్నాయి. ఇతని చీకటి జీవితం ఆధారంగా ఎస్.హుస్సేన్ జైదీ 'బ్లాక్ ఫ్రైడే' పుస్తకం, అనురాగ్ కాశ్యప్ చిత్రం వచ్చాయి.

డాన్లు... ఖాకీలు... వివాదాలు...

1990ల్లో డాన్లే కాదు. వారి చీకటి చర్యలను ఓ కంట కనిపెడుతూ ఆటకట్టించే పనిలో వున్న పోలీసు అధికారులూ వార్తల్లో నిలిచారు. మరీ ముఖ్యంగా ప్రదీప్ శర్మ, దయా నాయక్. 'ఎన్‌కౌంటర్ స్పెషలిస్టు'గా పేర్గాంచిన నాయక్ 1995లో పోలీసు విభాగంలో చేరారు. చోటా షకీల్‌తో ఇతనికి సంబంధాలున్నాయని, మాఫియా డాన్ల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు తీసుకున్నాడని ఇతని మీద ఆరోపణలున్నాయి. ఆ కారణంగా 2006లో ఉద్యోగం నుంచి సస్పెండ్ అయ్యాడు. 2010లో సుప్రీంకోర్టు అతనిపై వచ్చిన అభియోగాలను కొట్టివేయడంతో తిరిగి ఉద్యోగంలో నియమితుడయ్యాడు. అయితే ఈ ఏడాది మళ్లీ సస్పెండ్ అయ్యాడు. ఇక పోతే శర్మ 1984లో మహీంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా కెరీర్ ప్రారంభించాడు. 2006లో నకిలీ ఎన్‌కౌంటర్‌లో చోటా రాజన్ అనుచరుడు రామనారాయణన్ గుప్తాను చంపాడన్న ఆరోపణను ముంబై కోర్టు కొట్టివేసినా... బాంబే హైకోర్టులో కేసు నడుస్తూనే వుంది.

జయంతి పేరు గుర్తుకు రాగానే అమాయకత్వంతో కూడుకున్న ముఖం. అందులో రవ్వంత గడుసుతనం.. మరికాస్త మొండితనం.. ఆనందం అందరికీ పంచుతూ ఆవేదనని తనలోనే మిగుల్చుకునే తత్వం ఇవన్నీ ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. జలకాలాటలలో అంటూ చెలికత్తెలతో జలకాలాడినా, జగదేకవీరున్ని కైవసం చేసుకున్నా ఎప్పుడూ రెండో ప్రాధాన్యతనే సంతరించుకోవడం ఆమె పాత్రీకరణగా మిగిలిపోయింది. కానీ కన్నడ నాట గొప్ప నటిగా వెలుగొందింది ఈ తెలుగింటి చామంతి.

సినిమాల్లోకి రాక ముందు ఆమె పేరు కమలకుమారి. ఆంధ్రా కర్ణాటక సరిహద్దు బళ్లారిలో 1945లో పుట్టింది. ఉగ్గుపాలతో తెలుగుతో పాటు కన్నడం కూడా వంటబట్టింది. ఆమె తండ్రి బాలసుబ్రహ్మణ్యం బెంగుళూరులో సెయింట్ జోసెఫ్ కాలేజీలో ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా వుండేవాడు. అందువలన ఇంట్లో క్రమశిక్షణకి పెద్దపీట వేసేవారు. జయంతి తొలి సంతానం కావడంతో గారాబంగా పెంచడం సహజం. తల్లి సంతానలక్ష్మి జయంతి మాటలకు ఎదురు చెప్పేది కాదు. ఆమెతో పాటు ఇద్దరు తమ్ముళ్లుండేవారు. అయితే జయంతి బాల్యం సాఫీగా సాగలేదు. తల్లిదండ్రుల మధ్య పొరపొచ్చాలు చినికిచినికి గాలివానై తల్లి పిల్లల్ని తీసుకుని చెన్నై తరలిరావడంతో జయంతి తనదైన జీవన పోరాటానికి సిద్ధమైంది. జయంతి మొదట క్లాసికల్ డ్యాన్సర్‌గా మారాలనుకుంది. అందుకనే చెన్నైలో చంద్రకళా అనే డాన్సు మాస్టర్ దగ్గర శాస్త్రీయ నృత్యం అభ్యసించింది. విశేషమేమిటంటే ఆ నృత్య కళాశాలను ప్రముఖ నటి మనోరమ నడిపిస్తూ ఉండేది. జయంతిది

కన్నడింట తెలుగు చామంతి

మ్యూజికల్ వాయిస్. చక్కగా మాట్లాడేది. ఆ చిలుకపలుకులు విని అందరూ సంబరపడేవారు.

సినీరంగ ప్రవేశం

జయంతి తల్లి సంతానలక్ష్మికి సినిమాలంటే ఆపేక్ష. యన్.టి.రామారావు షూటింగు జరుగుతుందని తెలిసి కూతురితో చూడ్డానికి వెళ్లింది. జయంతిని చూడగానే యన్.టి.ఆర్ ప్రేమగా దగ్గరకు పిలిచారు. ధైర్యంగా వెళ్లి నిలుచుంది. 'ఏం అమ్మాయ్! సినిమాల్లో నటిస్తావా' అని అడిగారు యన్.టి.ఆర్. ఇష్టమన్నట్టు తలూపింది. జగదేకవీరుని కథలో అవకాశం.. వరుణ కన్యగా నటించింది. ఆ సినిమా ఎంతపెద్ద సంచలనం సృష్టించిందో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు.

తమిళ, కన్నడ సినిమాలకే మొగ్గు

'జగదేకవీరుని కథ' చిత్రంతో కమలకుమారి జయంతిగా మారింది. అప్పట్లో ఒకపక్క సావిత్రి, అంజలీదేవి, సరోజాదేవి, యల్ విజయలక్ష్మి, జమున, కృష్ణకుమారి ఇలా అందరూ విజయవంతమైన, అందమైన కథానాయికలే రాజ్యమేలుతుండేవారు. వారి మధ్య పోటీ ఉండేది. ఈ పోటీలో నలిగిపోవడం తనకిష్టం లేదు. పైగా తమిళ, కన్నడ భాషల్లో అవకాశాలు వెదుక్కుంటూ వచ్చాయి. కన్నడంలో ప్రముఖ హీరోలందరి

సరసనా డా.రాజ్‌కుమార్, విష్ణువర్ధన్, ఉదయ్‌కుమార్, కళ్యాణ్ అలాగే తమిళంలో యంజీఆర్, శివాజి, యస్.యస్. రాజేంద్రన్, ముత్తురామన్‌లతో నటించింది. ఒకానొక సమయంలో కన్నడ రాజ్‌కుమార్‌కి సరిసమానమైన క్రేజ్‌తో కన్నడ సినీరంగాన్ని ఏలగలిగింది. అదీ జయంతి ప్రతిభ. ఈ విషయాన్ని స్వయంగా డా.రాజ్‌కుమార్ ప్రకటించారు.

తెలుగులో అన్నీ వైవిధ్యమే

ఆ రోజుల్లో 'శారద' చిత్రంలో శారదకి ఎంత పేరొచ్చిందో తెలిసిందే. జయంతి నటనా అసాధారణమే. ఒక అమాయకురాలిని బ్రతికించుకోవడం కోసం తన భర్తను సైతం త్యాగం చేయగలిగిన పాత్రలో చివరి వరకూ మానసిక సంఘర్షణ అనుభవించే ఆ పాత్రకి జీవం పోసింది. అలాగే 'జీవితం' ముఖ్యంగా 'కలెక్టర్ జానకి' చిత్రాల్లో జమునతో పోటీపడి నటించి ఆమె కంటే ఎక్కువ మార్కులే కొట్టేసింది. నాగభూషణం పాడిన పాట 'పాట ఆగిందా.. ఒక సీటు గోవిందా' మరచిపోలేం కదా. కలెక్టరుగా జమున ఆమె దగ్గర పి.ఎ.గా జగ్గయ్య అతని భార్యగా జయంతి పాత్రల్ని సజీవం చేశారు. ముఖ్యంగా జయంతి నటన మరచిపోలేరు. పిల్లలకు స్నానం చేయిస్తున్న ఘట్టం. థియేటర్లలో చప్పట్లు మార్మోగిపోయాయి. మధ్యతరగతి మహిళ జీవితానికి అద్దం పట్టింది. ఇక 'మాయదారి మల్లిగాడు'తో మరో త్యాగపూరితమైన పాత్ర "మల్లిపందిరి నీడలోన జాబిల్లి.." పాటలో జయంతి అందం అభినయం కళ్లముందు కట్టినట్లుంటుంది. మరపురాని మనిషి, నిత్యసుమంగళి, రాముడు కాదు కృష్ణుడు, అల్లూరి సీతారామరాజు వంటి చిత్రాల్లో నటించినా ముఖ్యంగా యన్.టి.ఆర్‌తో నటించిన కొండవీటి సింహం, జస్టిస్ చౌదరి చిత్రాలు ఆమె జీవితంలో మకుటాయమానంగా నిలుస్తాయి.

నిర్మాతగా రెండు చిత్రాలు

జయంతి వ్యక్తిగత జీవితంలోకి పేకేటి శివరామ్ ప్రవేశించాక ఎన్నో ఎత్తుపల్లాలను చవిచూసింది. ఆయనతో ఇమడలేక ఒంటరిగా తన జీవనయానం చేస్తున్న రోజుల్లో సినిమాల్లో ప్రొడక్షను వ్యవహారాలు చూస్తున్న గిరిబాబు తారసపడ్డాడు. ఆయన కోసం 'చందన' అనే సినిమాను నిర్మించింది. రంగనాథ్‌ని హీరోగా పరిచయం చేసింది. ఆ సినిమా ఆశించిన విజయం సాధించలేదు. తర్వాత రా.వి. శాస్త్రి నవల 'రత్తాలూ–రాంబాబు' చిత్రాన్ని నిర్మించి చిక్కుల్లో పడింది. తర్వాత నిర్మాణానికి దూరమయ్యింది. వచ్చిన అవకాశాలను సద్వినియోగపరుచుకోవడం తప్ప, నెత్తురోడ్చి సంపాదించిన డబ్బు అనుభవం లేని రంగంలో ఖర్చు చేయ్యకూడదన్న నిర్ణయానికొచ్చింది.

జమునతో..

రాజకీయాల్లో..

రామక్రిష్ణ హెగ్డే నేషనల్ ఫ్రంట్‌లో ప్రధాన భూమిక పోషిస్తున్న రోజుల్లో క్రియాశీలక రాజకీయా ల్లో ముందుండేది. అయితే ఏ విషయాన్నైనా కుండబద్దలు కొట్టి మాట్లాడటం జయంతి నైజం. ఇది రాజకీయాలకు సరిపడదు అని తెలుసుకుని రాజకీయాలకు దూరంగా ఉంటోంది.

రాజ్‌కుమార్‌తోనే 45 సినిమాలు

"జీవితమంటే అదే. మొదట్లో నటులుగా పోటీపడినా తర్వాత ఒకర్నొకరం అర్థంచేసుకుని నలభై అయిదు సినిమాల్లో కలిసి నటించాం. తిరిగి చూసుకుంటే అద్భుతంగా అనిపిస్తుంది. ఇది జీవితం. ఇలాంటి అద్భుతాలు ఎన్నో జరుగుతుం టాయి. వీటికి అలవాటు పడిపోయాను. నా జీవితంలో జరిగిన ప్రతి సంఘటననీ పాజిటివ్‌గా తీసుకుంటాను" అంటోంది జయంతి. నటిగా, తల్లిగా మంచి మార్కులే సంపాదించాను. అవార్డులు రివార్డులూ కన్నడ, తమిళ సినిమాలకు వచ్చాయి. తెలుగు సినీ పరిశ్రమలో ఆ అదృష్టం కలగలేదు. అయితే కన్నడిగులు, తమిళులు అందరూ నన్ను తమ ఆడబిడ్డగా చూసుకుంటు న్నారు. ఇంతకు మించిన ఆనందమేముంటుంది? మహానటుడు ఎఎన్ఆర్ సరసన నటించలేక పోయాను. అదో తీరని వెలితి. మహానటి సావిత్రికి నాకు మధ్య తొలిరోజుల్లో కొంత కమ్యూనికేషన్ గ్యాప్ ఉంది. అది భర్తీ కాలేదు. అదో బాధ. జయంతి మోసపోతుంది అంటారు. ఎవరూ మోసపోరు ఒక్కోసారి మన అంచనాలు చాలా విషయాల్లో తప్పవుతాయి. కొన్ని నిజమవుతాయి అంతవరకే. మన జీవితంలో జయాపజయాలకు మనమే బాధ్యులం" అంటోంది స్థిరమైన అభిప్రాయంతో.

ఎన్టీఆర్‌తో...

- ఇమంది రామారావు
9010133844

...పిల్లి కూనలకు అంకితం

హన్నావా పాషా! వాషింగ్టన్ వాసి. వయసు మూడు పదుల లోపే. కానీ మనసు మాత్రం వెన్న. ఎక్కడైనా సరే రోడ్డుమీద దీనావస్థలో జంతువులేవైనా కనిపించాయంటే ఆమె మనసు కరిగిపోతుంది. ఇక దాని మంచీ చెండూ చూసే వరకూ ఆమె నిద్రపోదు. అందుకోసం తన కెరీర్‌ను సైతం వదులుకుంది. యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన దగ్గర నుంచి అదే పనిలో నిమగ్నమైంది. గత ఎనిమిదేళ్లలో ఇప్పటికి కొన్ని వందల పిల్లి పిల్లలను కాపాడింది. హన్నా జంతు ప్రేమ ఇప్పటిది కాదు. తనకు పన్నెండేళ్ల పసి ప్రాయంలోనే కలిగింది. అప్పుడే ఓ అనాథ పిల్లిపిల్లను కాపాడి పెంచుకుంది. ఆ క్రమంలోనే పిల్లుల గురించిన అనేక విషయాలను తెలుసుకోగలిగింది. అప్పుడే మాంసం తినకూడదని కూడా నిర్ణయించుకుంది. ఇప్పుడామె ప్రధాన వ్యాపకం ఇలాంటి అనాథ పిల్లుల్ని రక్షించడమే. అయితే కొంత మంది పొరపాటున తల్లి వున్న పిల్లి పిల్లల్ని కూడా అనాథలనుకుని ఆ రెంటినీ వేరు చేస్తుంటారు. అందుకే ముందుగా ఎక్కడైనా గాయపడిన, నీరసించిన పిల్లి పిల్ల ఒంటరిగా కనిపిస్తే ముందు దానికి తల్లి వుందో లేదో నిర్ధారించుకోవాలంటుంది హన్నా. ఆ తర్వాతే దాన్ని రక్షించేందుకు పూనుకోవాలన్నది ఆమె సూచన. బాగా బుల్లి పిల్లులను పెంచుకోవాలని పెంచుకోవాలని నిర్ణయం తీసుకోవడానికి ముందు ఒకటి ఆలోచించుకునేది. తను కొద్ది వారాలపాటు ఆ బుజ్జి ప్రాణికి అందుబాటులో వుండగలనో లేదో చూసుకునేది. మరి రాత్రుళ్లు కూడా ప్రతి రెండు గంటలకు లేచి వాటికి పాలు పట్టడం లాంటివి చేయాల్సి వుంటుంది. పిల్లుల ఆలనా పాలనా చూడడం ఎంత కష్టమో కదా.

మరుగుజ్జు గ్రామం

గ్రామాలు మనకు కొత్తేమీ కాదు. అలాగే వింతా కాదు. అన్ని దేశాల్లోనూ గ్రామాలుంటాయి. అలాగే చైనాలోనూ కనిపిస్తాయి. అయిత ఇక్కడి సిచువాన్ రాష్ట్రంలోని యాంగ్జి గ్రామం గురించే కూసింత ప్రత్యేకంగా చెప్పుకోవాల్సి వస్తోంది. ఎందుకంటే ఇది మరుగుజ్జు గ్రామం కనక. ఇక్కడ మొత్తం 80 మంది వుంటే అందులో సగం మంది పొట్టివారే. వీరిలో అత్యంత పొడగరి 3 అడుగుల 10 అంగుళాల పొడవు వుంటారు. ఇక పొట్టి వాళ్లు 2 అడుగుల ఒక్క అంగుళం వుంటారు. దశాబ్దాల తరబడి చైనా శాస్త్రవేత్తలను ఈ విషయం కలవర పెడుతోంది. ఇప్పటికే అక్కడి నేల, నీరు, పంట ... వంటి అనేక అంశాలపై ఎన్నో పరిశోధనలు చేశారు. కానీ ఆ సమస్యకు కారణాన్ని మాత్రం కనిపెట్టలేకపోయారు.

కూతురితో ప్రపంచ యాత్ర

కొందరికి కొత్త ప్రదేశాలు చూడాలని, అక్కడి ప్రజలతో కలిసి మాట్లాడాలని, వారి సంస్కృతీ సంప్రదాయాలు తెలుసుకోవాలని వుంటుంది. అందుకోసం ఎంత డబ్బు, సమయం వెచ్చించడానికైనా వెనుకాడరు. చైనాలో నివసించే కొరియా దేశస్థుడు ర్యు చున్‌జియో అలాంటివారిలో ముందుంటాడు. లాభాలతో నడిచే తన కంపెనీ షేర్లను, ఇంటిని సైతం అమ్మేశాడు. రెండేళ్ల కుమార్తెతో ఎక్కువ సమయం గడపడానికి, ఆ చిట్టి తల్లితో కలిసి ప్రపంచం చుట్టి రావాడానికి ఈ పని చేశాడంటే ఎవరైనా ఆశ్చర్యపోతారు. ఆ పాప కొత్త వారిని పరిచయం చేసుకోవడానికి, వారితో స్నేహం చేయడానికి, వారి జీవన శైలిని అత్యంత సమీపం నుంచి పరిశీలించడానికి కావాల్సిన ఏర్పాట్లను ర్యు ఇలా చేస్తున్నాడట. అయితే యాత్ర మొదటి సంవత్సరంలో మాత్రం చైనాలోనే పర్యటిస్తారు. తర్వాత ఇతర దేశాలకు వెళ్తారు. ఇలాంటి అవకాశం ఎందరు చిన్నారులకు వస్తుంది చెప్పండి?!

బంతులతో ధనవంతుడు

చెప్పలేం! ఏ పని ఎలా డబ్బు సంపాదించిపెడుతుందో! ఇదిగో ఈయనగారి పేరు గ్లెన్ బెర్గర్. ఒకప్పుడు ఫ్లోరిడాలోని గోల్ఫ్ కోర్టుల దగ్గర మాటు వేసి గోల్ఫ్ బంతులను దొంగిలించి.... వాటిని అమ్ముకొని జీవిక సాగించేవాడు. ఎందుకో అతనికే ఆ పని నచ్చలా. సరిగ్గా ఆ సమయంలో అతనికి వచ్చిన ఓ ఐడియా జీవితాన్నే మార్చేసింది. గోల్ఫ్ ఆట గురించి తెలుసు కదా. పెద్ద మైదానాల్లో బుజ్జి బంతులు, ఇనుప కర్రలతో ఆడే ఆట. ఆటగాడు కొట్టిన కొట్టుడుకు బంతులు దూరంగా వెళ్లిపడుతుంటాయి. ఆ చుట్టుపక్కల వున్న సరస్సుల్లోకి కూడా దూసుకెళ్తుంటాయి. అలాంటివాటిని పట్టుకునే పనిని చేపట్టాడు గ్లెన్. అందుకోసం డైవర్ అవతారం ఎత్తాడు. ఇక చూస్కోండి! నీళ్లలో పాములు మొదలుకొని మొసళ్ల వరకు ఎన్నో జలచరాలు అతని చుట్టూ అతనితోపాటే సంచరిస్తుంటాయి. వాటిని ఏ మాత్రం లెక్కచేయయకుండా బంతులు ఏరడంతో ... అతని దశ తిరిగింది. వాటిని శుభ్రం చేసి ఒక్కో బంతిని ఒక్కో డాలర్ చొప్పున అమ్ముతున్నాడు. ఇప్పుడతను మిలియనీరు మరి.

పసిమొగ్గల్ని చెండుకు తినే మృగాళ్లు ఇంట్లోని దగ్గరి బంధువుల్లా, సన్నిహితుల్లా తిరుగుతున్నారని చెప్పేందుకు కాస్త గుండెను మెలిపెడుతూనే చెబుతుంది 'అశ్విని'. తోడుకు, అండకు తెలియకుండానే ఈ రాక్షసుల చేతులకు కన్నబిడ్డల్ని అప్పజెప్పేస్తున్న తల్లిదండ్రుల ఉదాసీనత, పిల్లల తీరులో వస్తున్న తేడాల్ని గమనించి కూడా చూసిచూడనట్టు వ్యవహరించే ఉపాధ్యాయుల తీరులో మార్పు కోసం 'జస్ట్ ఎల్లో' సినీ సంస్థ చిత్రీకరించిన ఓ సామాజిక లఘు చిత్రమిది. తనపై జరుగుతున్న లైంగిక హింసను ఎవరికీ చెప్పుకోలేక సతమతమౌతూ సోషల్ విత్‌డ్రావల్‌కు లోనైన ఓ మెరిట్ విద్యార్థిని అశ్విని కథ ఇది.

పసిమొగ్గ-అశ్విని

చాలా సృజనాత్మకమైన నేరేషనే అయినా ఎక్కడా చిన్నారి ఎమోషన్స్‌ను డామినేట్ చేయదు. క్లాస్‌లో ఎంతో చలాకీగా ముందుండే ఆ పాపలో కనిపించే నిర్లిప్తత, నిస్సహాయత, స్తబ్ధతల్ని గమనించిన ప్రిన్సిపాల్ విషయాన్ని తేలిగ్గా తీసుకుంటుంది. పిల్లలతో కలిసి స్కూల్ బస్‌లో వెళ్లే టీచర్ శిరీష చిన్నారిలో కనిపించే మార్పును, హింట్స్‌ను గమనించి విషయాన్ని కచ్చితంగా అంచనా వేస్తుంది. బడి నుంచి ఇంటికి హుషారుగా వెళ్లే పిల్ల కాస్త బస్సు దిగడానికి భయపడటం ఆమెను ఆశ్చర్యపరుస్తుంది. అదే విషయం ప్రిన్సిపాల్‌తో చర్చించినా ఆమె కొట్టిపారేసే ప్రయత్నం చేస్తుంది. క్లాస్‌లో వెనకబాటుకు వేరే కారణాలున్నాయేమో అని తల్లిదండ్రులను కలుస్తుంది. అలా ఇంటికి వెళ్లిన ఆమె.. శిరీష చెప్పిన విషయాన్ని కళ్లారా చూస్తుంది. మేనబావ వరసయ్యే ఓ ముప్పై ఏళ్ల పశువు దీపక్ మంచితనంగా దగ్గరకు తీసుకుంటున్నట్టు అశ్వినిపై విషం కక్కడంతో ప్రిన్సిపాల్ బుద్ధి చెబుతుంది. అంతకు ముందు స్కూల్‌కు చైల్డ్ కౌన్సిలర్ అవసరమని చెప్పిన శిరీషతో బడ్జెట్ అంటూ విషయాన్ని తోసిపుచ్చిన ప్రిన్సిపాలే కొత్త కౌన్సిలర్‌ను వెంటనే నియమిస్తుంది. దేశంలో ప్రతి ఇద్దరు చిన్నారుల్లో ఒకరిపై దగ్గరి బంధువులు, సన్నిహితుల రూపంలో లైంగిక దాడి జరుగుతుందనే విషయాన్ని డైలాగుల్లో చెప్పిస్తాడు దర్శకుడు.

సృజన కథకు లోబడే..

రచన, దర్శకత్వం వహించిన శశాంక్ యేలేటి ప్రతిభ ఎన్నో సన్నివేశాల్లో కనిపిస్తుంది. కల్చరల్ యాక్టివిటీస్‌లో భాగంగా కథ చెప్పే కార్యక్రమం ఉంటుంది. ఆ రోజు కథ చెప్పాల్సింది అశ్వినినే. తన వేదనను కథ రూపంలో చెప్పే ప్రయత్నం చేస్తుంది అశ్విని. తండ్రితో కలిసి ఆటల్లో మునిగిపోయి మేనబావ రావణుడి నుంచి తప్పించుకుం దామనుకుంటుంది అశ్విని. ఇక్కడ కంపెనీ కోసం బంగారు జింకను వేటాడ్డానికి వెళ్లే రాముడి వేషధారణలో బిజీ ఉద్యోగిగా అశ్విని తండ్రిని చెబుతుంది. వర్క్ ఫ్రమ్ హోమ్ అయినా 24 గంటలు కంప్యూటర్‌కే అతుక్కుపోయే సీతమ్మలా తల్లి గురించి చెబుతుంది. ఇంటిని అడవిగా పరిచయం చేసే ఆ కథలో అశ్వినిని చెరబట్టే ప్రయత్నం చేసే దీపక్ దశ కంఠుడి నీడగా కనిపిస్తాడు. చిన్నారిని హింసిస్తున్న చేతి వేలికి ఉన్న పెద్ద ఉంగరాన్ని అశ్విని తను చెప్పే కథలో వేలికి కన్ను ఉన్నట్టుగా మారుస్తుంది. ఇలా చెప్పిన కథే ప్రిన్సిపాల్‌ను ఆలోచనలో పడేస్తుంది. ఆమెకు అర్థవంతంగా అనిపించనట్టు చూపించినా కథ ఆంతర్యం మాత్రం వీక్షకుడికి తేలిగ్గా అర్థమయ్యేలా నేరేట్ చేశారు. ఈ మొత్తం సన్నివేశం చాలా సృజనాత్మకంగాను, భావాత్మకంగాను ఉంటుంది. చిట్ట చివరన ఆ రాక్షసుడు ఎవరో ప్రిన్సిపాల్ గుర్తించేది ఈ కథ వల్లే. అశ్విని ఎంత యాక్టివ్, టాలెంటెడ్ విద్యార్థో చెప్పేందుకు క్లాస్ రూమ్‌లోని చార్ట్స్‌ను చూపిస్తారు. అశ్విని పేరు పక్కన 5 స్టార్లు, టీచర్ వస్తూ వస్తూనే అశ్వినికి లీడ్ ఇవ్వడం ద్వారా విద్యార్థిని ప్రత్యేకతను చెబుతాడు. చిన్నారి నటన అద్భుతం. మిగతా పాత్రలు వారి వారి పరిమితులకు లోబడి చక్కటి నటన ప్రదర్శించారు. ఫొటోగ్రఫీ అతి కీలకం. లైటింగ్ సెట్టింగ్స్ చాలా బాగా ఉన్నాయి.

సున్నితంగా..

చాలా తక్కువ డైలాగ్స్. అన్నింటికీ మించి విషయాన్ని చాలా సున్నితంగా హ్యాండిల్ చేశారు. ఎక్కడా జుగుప్సకు చోటులేకుండా సృజనాత్మకంగా మేనేజ్ చేశారు. అశ్వినికి ఎదురైన పరిస్థితే టీచర్ శిరీష కూడా చిన్నతనంలో భరిస్తుంది. అందుకే ఆమె వెంటనే అశ్వినిని అర్థం చేసుకోగలుగుతుంది. ప్రిన్సిపాల్ చర్యకు స్పందనగా 'నా బాల్యంలోను మీలాంటి వాళ్లు ఉంటే..' అని చివరిగా ఆమెతో చెప్పించే డైలాగ్ మనసులో అలా నాటుకుపోతుంది. నిజమే ప్రతి చిన్నారి బాల్యంలోను అటువంటి సంరక్షకులు ఉండాలి. వారి బాల్యంలో కామాంధుల గాయాలు లేకుండా జాగ్రత్త పడాలి. బాలలపై లైంగిక దాడిపై అవగాహన కలిగించే ఇలాంటి షార్ట్‌ఫిల్మ్‌ల ద్వారా మెసేజ్ తేలిగ్గా రీచ్ అవుతుంది. సందీప్ గుణ్ణం నిర్మాత అయిన ఈ షార్ట్ ఫిలిమ్ తెలంగాణ పోలీస్ శాఖ, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, సెర్ప్ సంస్థ సహకారంతో దీన్ని తెరకెక్కించారు.

యూట్యూబ్ లింక్

https://www.youtube.com/watch?v=0exANwyzHhc

-అజయ్ కుమార్ వారాల

పొద్దున్నే హడావిడి మొదలైంది. మామూలే కదా అని పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. ఇటు ఆరు, అటు ఆరు ఇళ్ళు వున్న చిన్న వీధి. నగర శివారు కాలనీ. ఈ మధ్యే కార్పొరేషన్‌లో విలీనమైన మున్సిపాలిటీ అది. అధికారికంగా మహానగరం పరిధిలోకే వచ్చినా ప్రజా జీవనంలో ఇంకా పల్లె వాతావరణం మిగిలే వుంది. దగ్గరగా వున్న రెండు ఇళ్ళ వాళ్ళు బైటకొచ్చి చూస్తున్నారు. రెండు మూడు నెలలకి ఓసారి ఈ హడావిడి ఆ వీధిలో మామూలే.

ఆ హడావిడి పూర్తయ్యే వరకూ వీధిలో అందరికీ చికాకే. వీధి డ్రైనేజీ పూడిపోవటం అంటే, ఓ రకంగా అందరి ఇళ్ళకీ పొంచి వున్న ప్రమాదం లాంటిది. ఎప్పుడు వెనక్కి ఎగదన్ని ఎవరింటిని ఛండాలం చేస్తుందో చెప్పటం కష్టం. ఆ ఇబ్బంది తొలగిపోవటం అందరికీ అవసరమే. ఇబ్బంది ఎవరికి వస్తే వాళ్ళు మనుషుల్ని పిలిపించి బాగు చేయించుకుంటారు. ఇప్పుడు జరుగుతున్నదీ అదే. తమ తమ పనిముట్లతో చిన్న బకెట్లతో వెదురు బద్దలతో ఆ పనివాళ్ళు చేస్తున్న హడావిడి అదే. ఆ పని పూరమాయించిన ఇంటాయన కూడా అక్కడే వున్నాడు.

డ్రైనేజి అలా పూడిపోవటానికి బాధ్యత ఎవరిదంటే నిజానికి ఆ వీధిలో ఎవరిదీ కాదు. బాధ మాత్రం అందరిదీ. మూడేళ్ళ క్రితం ఆ వీధికి డ్రైనేజీ అంటూ గోతులు తవ్వి పని ఆరంభించారు. వీధి వాళ్ళు సంతోషించారు. మున్సిపాలిటీవారికి ఆ చిన్న వీధి మీద ప్రేమ కలగటానికి కారణం స్థానిక ఎన్నికలు. ఆ పనంతా అకస్మాత్తుగా తలపెట్టి హడావిడిగా పూర్తిచేశారు. గోతులైతే తవ్వి తూములు వేసి, మేన్‌హోల్స్ అవీ బాగానే కట్టారు. వచ్చిన చిక్కల్లా ప్లానింగ్ లోనే ఆ వీధి చివర నుంచి ఆ డ్రైనేజీ దారి ఓ ఫర్లాంగ్ వెళ్ళి ఆఖరైపోయింది. మురికి అంతా సరిగా వెళ్ళే మార్గం లేదు. ఓ చిన్న ఖాళీ స్థలం వుంటే, అందులోకి వదిలేశారు. ధారాళంగా వెళ్ళే మార్గం లేక. తరచుగా ఆ వీధి డ్రైనేజీ పూడిపోతోంది. తాత్కాలికంగా బాగు చేయించి కాలం గడుపుతున్నారు.

ఆ మేన్ హోల్ మూత తియ్యగానే భయంకరమైన వాసన బైటికొచ్చింది. ఇంచు మించు మూతవరకూ కల్మశం నిండిపోయి వుంది. వెదురు బద్దలతో పొడిచారు. బకెట్లతో కొంత తీసి పక్కన పోశారు. తీసింది తీస్తుంటే మళ్ళీ నిండిపోతోంది. రెండు మూడు గంటలైనా పెద్దగా పరిస్థితి ఏం మెరుగుపడలేదు. దుర్గంధంలో, మండే ఎండలో బాగా అలిసిపోయిన ఆ నలుగురూ కాసేపు ఆగారు. నలుగురి వొళ్ళూ చెమటతోటి, కలశ్మం తోటి తడి అయిపోయింది. వెళ్ళి టీ తాగి ఓ అరగంటలో తిరిగి వచ్చారు. మళ్ళీ తమ తమ పనిముట్లతో ఆ అశుద్ధంతో యుద్ధం మొదలెట్టారు. మరో గంటకి పరిస్థితిలో కొంత కదలిక వచ్చింది. ఒక దానితో మరొక గొట్టాన్ని లింక్ చేసినట్టు కొన్ని తెల్లటి సన్న స్టీల్ గొట్టాలతో పొడిచారు. పని కొంత ముందుకు సాగినా, పూర్తిగా సానుకూల పడలేదు. మేన్‌హోల్‌లో కలశ్మం ఎత్తు కొంత తగ్గింది అంతే.

చూస్తుంటే కడుపులో తిప్పేలా వుంది వాతావరణం. పది నిముషాలు పట్టుమని ఆ వాసన భరించేలా లేదు పరిస్థితి. నాలుగు గంటలుగా వాళ్ళు అలా ఆ అశుద్ధ యుద్ధం చేస్తూనే వున్నారు. ఇంతా చేస్తే ఆ నలుగురూ, వచ్చే డబ్బు పంచుకుంటే ఒక్కొక్కరికీ మూడు నాలుగు వందలు వస్తుందేమో.

వాళ్ళ పనిలో శ్రమే కాదు, నిజాయితీ కూడా వుంది. పనిని మధ్యలో వదిలెయ్యరు. ఏదో చేసేశాం అన్నట్టు పైపైన మాయ చేసి వెళ్ళరు. సమస్య పూర్తిగా సానుకూల పడ్డాకే డబ్బు తీసుకువెళతారు.

నలుగురు కలిసి ఓ రెండు నిమిషాలు చర్చించుకున్నారు. నలుగురిలోకి సన్నగా వున్న కుర్రాడు, ఇరవై ఏళ్ళుంటాయి, తన బట్టలు విప్పటం మొదలెట్టాడు. కేవలం డ్రాయరుతో మిగిలాక నెమ్మదిగా ఆ మేన్‌హోల్ లోకి దిగాడు. ఆ కల్మశం అతని భుజాల్ని దాటి పీక వరకూ వచ్చింది.

ఓ మనిషి అందులోకి అలా దిగ గలగటమే భయంకరం. అందులో అక్కడే వుండి, వంటి పని చెయ్యటం దారుణం. పైనున్న ముగ్గురూ, ఆ కుర్రాడు గోతి లోంచి అందించేది అందుకుని బైటపోస్తున్నారు. మధ్య మధ్యలో పనిముట్లు అందిస్తున్నారు.

◆ కథ

మేన్‌హోల్

- వి.రాజారామమోహనరావు
9394738805



లోపలున్న ఆ కుర్రాడు అరగంటసేపు తంటాలు పడ్డాక గోతిలోని జల కొంచం కదిలింది. ఆ కుర్రాడు ఆయాస పడుతున్నాడు. అతని శ్రమ అంతా ఇంతా కాదు. చూస్తున్న ఇంటి యజమాని. ఆ పనివాళ్ళకి పురమాయించిన ఆయనకే కష్టం అనిపిస్తోంది. 'పోనీ... పని ఆపేయమంటే..' అనుకున్నాడు. ఆపేయగల పనికాదు. ఆపేస్తే ఈ బైటి ఛండాలమంతా, ఇంట్లోకి ఎగతన్నుతుంది. ఆ పని ఎంత తొందరగా ముగిసిపోతే అంతనయం.

పై ముగ్గురూ చూస్తుండగానే, మేన్‌హోల్‌లో కుర్రాడు కళ్ళు తేలేశాడు. మెలికలు తిరిగినట్టు వంగిపోయి, ఆ మేన్‌హోల్‌లో ఒరిగిపోయాడు. పైనున్న ఒకతను గబుక్కున గోతిలోకి దిగాడు. ఆ కల్మశంలో మునిగి ఆ కుర్రాడిని పట్టుకుని, పైకి లేవనెత్తాడు. పై నున్న ఇద్దరు సాయం పట్టి, కింద అతని తోడ్పాటుతో ఆ కుర్రాడిని గోతి బైటకి తీసి, పడుకోబెట్టారు. ఓ పావుగంట నానా హడావిడి అయింది. కొన్ని నీళ్ళు పోసి కడిగారు. అయినా ఆ కుర్రాడు స్పృహలోకి రాలేదు. అందరికీ కంగారు. ఇంటాయన మరీ కంగారు పడుతున్నాడు. మేన్‌హోల్‌లోని విష వాయువుల వల్ల అలా స్పృహ తప్పిందని, హాస్పిటల్‌కి తీసికెళ్ళాలని అనుకున్నారు. ఆటోని పిలుచుకు వచ్చి తీసికెళ్ళిపోయారు.

అంతకు ముందు ఆ వీధిలో అనేకసార్లు డ్రైనేజీ బాగుచేయించినా ఎప్పుడూ ఇలా జరగలేదు. మేన్‌హోల్ లోపలి గేస్ వల్ల ఇంతటి ప్రమాదానికి ఆస్కారం వుందని తెలిసేటప్పటికి అందరూ తొట్రుపడ్డారు. ఆ కుర్రాడేమవుతాడోనని లోలోపల కొంచెం మదనపడ్డారు.

రాత్రి గడిచి తెల్లారింది. ఆ కుర్రాడు రాలేదు కానీ, మిగిలిన ముగ్గురూ వచ్చారు. ఆ కుర్రాడు కోలుకున్నాడని, సాయంత్రం హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేస్తారని చెప్పారు. వీధిలో వాళ్ళకి అదొక ఉపశమనం. వచ్చిన ఆ ముగ్గురూ మూడు గంటలు పని చేశాక డ్రైనేజి బాగుపడింది. వాళ్ళు వెళ్ళిపోయారు. వీధి మామూలు పరిస్థితికి వచ్చింది. మేన్‌హోల్ గ్యాస్ వల్ల మరింతసేపు ఊపిరి పట్టేస్తే ఆ కుర్రాడి ప్రాణం పోయే ప్రమాదం వుంది. అదృష్టం అలా జరగలేదు. ఆ కుర్రాడు బతికి బట్టకట్టడం పెద్ద వార్త కాదు. ఒకవేళ చనిపోతే ఓ రోజు ఓ వార్త అయ్యేది. అంతేకానీ, ఈ ప్రమాదం ఈ డ్రైనేజి వ్యవస్థ గురించి, ప్రాణాలు పోవటానికి అవకాశమున్న అసహ్యమైన ఈ కూలి పని గురించి ఎవరికీ ఏం అనిపించదు. అంతా మామూలే సర్వ సహజమే అనిపిస్తుంది. రెండు మూడు వందల రూపాయల కూలి కోసం నిలువెత్తు ఛండాలంలో మునగటం ప్రాణాలమీదకి వచ్చినా అలవాటుగా భరించటం అమానుషం అనిపించటం లేదు. మామూలే అనిపిస్తోంది. ప్రపంచం అంతా దగ్గరైపోతోంది. అద్భుతాలు సాధించేస్తున్నాం. ప్రగతిదారుల్లో పరిగెడుతున్నాం. ఇవీ వినిపిస్తున్న కబుర్లు. అవన్నీ కొంతవరకూ నిజమే. చాలామందికి చాలారకాల సౌకర్యాలు, సౌఖ్యాలు పెరుగుతున్నాయి. అదో ధోరణి... అదో తరగతి. కానీ ఈ డ్రైనేజి లాంటి అమానుషాలు కల్మశం చుట్టూ పెనవేసుకున్న వృత్తులూ మురికి బతుకులూ అలాగే వుంటున్నాయి. చిత్రం ఏమిటంటే, హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయిన ఆ కుర్రాడు, ఆ మర్నాడే మరో మేన్‌హోల్‌లోకి దిగటానికి సిద్ధంగా వుండటం. మనుషులు ఇలాంటి వాటిలోకి దిగనక్కర్లేని యంత్రాలో, పరికరాలో వచ్చేవరకూ, అలాంటి కుర్రాళ్ళు ఆ పనుల కోసం అలా సిద్ధంగానే వుంటారు. అదే దురదృష్టం. తలుచుకుంటే అటువంటి పరికరాలు, యంత్రాలు అమలులోకి తేగలరు. ఈ దురదృష్ట వృత్తి కనుమరుగయ్యేలా చెయ్యనూగలరు. ఎటొచ్చీ యంత్రాంగం పూనుకోవాలి. ✦

చిన్నపిల్ల

అప్పారావు: మా అమ్మాయి ఈ మధ్య మరీ చిన్న పిల్లలా బిహేవ్ చేస్తోంది!

డాక్టర్: ఏం చేసింది?

అప్పారావు: నేను గోలీలాట ఆడుతుంటే వాటిని లాక్కుంటోంది.

నవ్వుల్-పువ్వుల్

ముగ్గురు థీరీ

మీరు పొద్దున్నే లేచి ముగ్గురిని నిద్ర లేపండి.

వాళ్ళు ముగ్గురిని మరో ముగ్గురిని లేపమనండి.

ఇలా బద్దకాన్ని భారతదేశం నుండి తరిమేయవచ్చు.

గమనిక: నన్ను మాత్రం లేపొద్దు.......

ఆదివారం ఆఫీస్

నాది మతిమరుపని ఎగతాళి చేస్తుంటావు కదా అస్తమానం.

ఈ రోజు ఒక్క వస్తువు కూడా మిస్ కాకుండా అన్నీ గుర్తుపెట్టుకుని ఆఫీసుకి తీసుకెళ్తున్నాను తెలుసా? గొప్పగా చెప్పాడు లంబు

ఈ రోజు ఆదివారమండీ. తలబాదుకుంటూ గొణిగింది భార్య

చెవుడు

ఒక ఊళ్ళో ఓ భార్యాభర్త ఉన్నారు. ఒకసారి భర్తకి తన భార్యకి చెవుడు వచ్చిందేమో అని అనుమానం వచ్చింది. అది ఆమెతో నేరుగా మాట్లాడటం ఇష్టం లేక సలహా కోసం ఓ వైద్యుడి దగ్గరికెళ్ళాడు.

"దానికో ఓ చిన్న పరీక్ష ఉంది. దాని ప్రయోగిస్తే మీ ఆవిడకు చెవుడు ఏమాత్రం ఉందో తెలుస్తుంది" అన్నాడు డాక్టర్

"మొదట 40 అడుగుల దూరంలో నిల్చుని మీరు మామూలుగా మాట్లాడుతున్నట్లు మాట్లాడండి. వినిపిస్తుందేమో చూడండి. ఒకవేళ వినిపించకపోతే పది అడుగులు దగ్గరకు వెళ్ళి అదే విధంగా చేసి చూడండి. అలా ఆమెకు వినిపించేదాకా చేసి ఈ పరీక్ష ద్వారా మీరేం గమనించారో నాకొచ్చి చెబితే నేను దానికి తగ్గట్టు వైద్యం చేస్తాను' అన్నాడు. దూరంలో నిలబడి ఏవోయ్ ఈ రోజు ఏం కూర చేశావ్? అని అడిగాడు.

ఏం సమాధానం వినిపించలేదు. మళ్ళీ కొంచెం దగ్గరకొచ్చి అదే ప్రశ్న అడిగాడు. ఉహు సమాధానం లేదు. అలాగే వంటగదిలోకి వెళ్ళి ఏవోయ్ ఇవాళ ఏం కూర చేశావ్ అడిగాడు? లాభం లేదు. ఈ సారి



సరాసరి ఆమె వెనకాలే వెళ్ళి నిల్చుని ఏవోయ్ ఇవాళ ఏం కూర చేశావని అడిగాడు విసుగ్గా

ఆమె కోపంగా మీకిది ఐదోసారి చెప్పడం. చికెన్ చేశాననీ!! అనింది.

చూద్దామా



విజయ నగర రాజుల చరిత్రలో చంద్రగిరి ఓ ప్రముఖ స్థానం వహించింది. కృష్ణరాయల విడిది కేంద్రంగా అలరారిన ఈ కోట... ఇప్పటికీ పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందిస్తూ చరిత్ర సాక్ష్యంగా నిలుస్తోంది. శ్రీ కృష్ణదేవరాయలు తిరుపతి దర్శించినప్పుడు ఈ కోటలోనే విడిది చేసేవారు. ఇది మన చంద్రగిరి మాత్రమే కాదు. మన రాయల చంద్రగిరి. శౌర్యానికి గీసిన గిరి.

రాయల్ గిరి చంద్రగిరి

- అవనిగడ్డ వనజ, తిరుపతి

చంద్రగిరి మొదట చోళుల పాలనలో ఉండేది. తర్వాత సాళులు ...అనంతరం తుళువ వంశం వారూ అధికారం చేపట్టారు. చంద్రగిరిలో సాళువ నరసింహరాయుల కొలువులో శ్రీకృష్ణదేవరాయుల తాత ఈశ్వరనాయుడు, అతని తదనంతరం కృష్ణరాయుల తండ్రి నరసనాయకుడు ఇద్దరూ సైన్యాధిపతులుగా కొలువు చేశారు. తుళువ నరసరాజు సాళువ నరసింహుని విజయనగర సామ్రాజ్యాధిపతిగా చేసే నాటికి అతనికి ఇద్దరు కుమారులు. మొదటి భార్య తిప్పాంబకు వీర నరసింహరాయులు, రెండో భార్య నాగలాంబకు కృష్ణదేవరాయులు. వీరిద్దరూ చంద్రగిరిలోనే పుట్టి విద్యాభ్యాసం కూడా ఇక్కడే చేశారు. చంద్రగిరి బ్రాహ్మణవీధిలో కాపురం ఉండే రాచరాజు వీరికి గురువు. ఆయన పుత్రులే ప్రఖ్యాతిగాంచిన తిమ్మరుసు మంత్రి, గోవిందామాత్యుడనే దండనాథుడు. వీరు చంద్రగిరివారని పుష్పగిరి వైద్యనాథస్వామి దేవాలయ శాసనంలో ఉంది. చంద్రగిరి కోట ప్రథమ ద్వారం తూర్పు వైపున ఉంది. దానిని దాటి బయటకు వస్తే ఉత్తర దిక్కున శేషాచల పర్వతాలు దర్శనమిస్తాయి. అక్కడి నుంచి తిరుమలేశుని మందిరం వరకు సరళరేఖ సదృశ్యమైన రాజమార్గం ఉంది. దానిగుండ శ్రీనివాస మంగాపురం చేరి దారి పొడవునా ఉన్న దేశాంతరి మండపాలలో అక్కడక్కడా విశ్రాంతి తీసుకుంటూ శ్రీవారి మెట్టు వైపుగా తిరుమల కొండకు కాలినడకన చేరేవారు. కొండ ఎక్కడం దిగడం రాయల వారికి చిన్నతనంలోనే అలవాటైపోయింది. రాజాధిరాజ, రాజపరమేశ్వర, మూరురాయరుగండ శ్రీ వీర ప్రతాప శ్రీ కృష్ణదేవరాయులుగా మారిన తరువాత కూడా ఆయనకు ఆ చిన్ననాటి ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. కృష్ణదేవరాయులు దివంగతుడయ్యే నాటికి ఆయన వయస్సు 40-42ఏళ్లే. 20 ఏళ్ల వయస్సులో చక్రవర్తి అయ్యి 20 ఏళ్లు పాలించి ఎనలేని కీర్తి ఆర్జించాడు.

బానిస పాలనకు పునాది

భారతావనిలో బ్రిటీష్ బానిస పాలనకు పునాదులు పడింది చిత్తూరుజిల్లాలోని చంద్రగిరిలోనే. వ్యాపారం కోసం దేశానికి వచ్చిన ఈస్టు ఇండియా కంపెనీకి 1639లో అపుడు చంద్రగిరి దుర్గాన్ని పాలిస్తున్న శ్రీరంగరాయులు చెన్న పట్టణంలో కొంత భాగాన్ని ధారాదత్తం చేశారు. దీనికి సంబంధించిన రాజపత్రాలపై చంద్రగిరి కోటలోని దర్బారు

హాలులో ఆమోదముద్ర వేశారు. ఇలా పొందిన స్థలంలో బ్రిటీష్ వారు సెయింట్ జార్జి కోటను నిర్మించారు. దీంతోనే భారతావనిలో బానిస పాలనకు పునాదులు పడ్డాయి. శ్రీరంగ రాయులు తరువాత మహారాష్ట్రులు, గోల్కొండ సుల్తానులు చంద్రగిరిని పాలించారు. క్రీ.శ. 1646లో గోల్గొండ నవాబు ఆధీనంలోకి చంద్రగిరి వచ్చింది. తరువాత క్రీ.శ.1758లో కర్నూలు నవాబు సోదరుడు అబ్దుల్ వహాబ్ ఆధీనంలోకి వచ్చింది. క్రీ.శ.1782, జనవరి నెలలో హైదరాలీ చంద్రగిరి కోటపై దండెత్తి కోటను స్వాధీనం చేసుకున్నారు. క్రీ.శ.1792లో మైసూరు మహారాజ, బ్రిటీష్‌వారికి శ్రీరంగ పట్టణంలో జరిగిన సంధి వల్ల చంద్రగిరి కోట బ్రిటీష్ వారి స్వాధీన మయ్యింది. పోర్టు సెయింట్ జార్జి ఒప్పంద ప్రతుల నకలును సైతం చంద్రగిరి మ్యూజియంలో సందర్శకులు చూడవచ్చు.

శత్రుదుర్భేధ్య దుర్గం

చిత్తూరు జిల్లాలో ప్రముఖ యాత్రా స్థలమైన తిరుపతికి దక్షిణ దిశగా 14 కిలోమీటర్ల దూరంలో చంద్రగిరి ఉంది. ప్రకృతిశోభతో, శత్రు దుర్భేద్యమైన దుర్గము, గంభీరములగు రాజప్రాసాదములు, దేవాలయాలు, సొంపయిన తటాకములు, శిలామంటపాలు, తోరణాలతో విజయనగర సామ్రాజ్య ప్రభువులకు మూడవ రాజధానీ నగరమై విరాజిల్లినది. విజయనగర యుగమునాటి సంస్కృతీ వైభవమునకు సజీవమూర్తులుగా నిలిచిన 'రాజమహల్', 'రాణిమహల్' ప్రసాదములు ఇతర కట్టడములు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. నాటి దేవాలయములు, మంటపములు శిథిలావస్థలో ఉన్నాయి.

చంద్రగిరి కోట అత్యంత బలిష్టమయిన రెండు ప్రాకారాల మధ్య నిర్మితమైంది. కోట అంతర్భాగంగా రాజ ప్రాసాదములు, మండపములు, దేవాలయాలు విలసిల్లాయి. అంతఃపురం లోపలి కట్టడములన్నీ విజయనగర సామ్రాజ్య కాలమునకు చెందినవి. వీటి నిర్మాణ చాతుర్యము అపురూపము. వీటిలో అనేకం శిథిలం కాగా ఎత్తయిన రాజ ప్రాసాదములు 'రాజమహల్', 'రాణిమహల్' నేటికీ ఠీవిగా నిలిచి వున్నాయి. వీటిలో రాజమహల్ పెద్దది. గంభీరమైనది. రాణిమహల్ చిన్నది. మనోహరమైనది. వీటి పునాదులు గట్టి రాతితోను, పైకప్పు భాగములు ఇటుక, సున్నముతో నిర్మితమైనవి. రాజభవనములకు నాలుగు దిక్కులలోనూ ముందుకు పొడుచుకుని వచ్చినట్లుండే విశాలమైన గవాక్ష మందిరములు మేలైన సున్నపు నగిషీతో నిర్మితమై కట్టడములకు వన్నె తీసుకొచ్చాయి. అందమైన ఆర్చీలు, కిటికీలు, మెట్ల వరుసలు, లోపలి పైకప్పు భాగమునకు మేలైన సున్నముతో తీర్చిదిద్దిన పుష్పములు, లతాలంకారములు ఆనాటి కళాకారుల భవన నిర్మాణ నైపుణ్యమును చాటి చెప్తాయి. ఈ రాజభవన నిర్మాణంలో కలప చాలా అరుదుగా ఉపయోగించారు. చంద్రగిరి కోటలోని రాజ భవనములు హంపిలోని విశ్వ వారసత్వ కట్టడ సముదాయములో చేరిన రాణివాసపు 'కమల భవన' నిర్మాణ శైలిని పోలి వుంటాయి. కోట మరియు కట్టడములు కేంద్రప్రభుత్వ పురావస్తు శాఖ హైదరాబాద్ విభాగం వారి సంరక్షణలో పరిరక్షించబడుచున్నవి. ఇటీవల రాణిమహల్ సమీపమున భారతీయ పురావస్తు సర్వేక్షణ హైదరాబాద్ విభాగం వారు నిర్వహించిన తవ్వకాలలో విశాలమైన గదుల పునాదులు, భవనముల లోనికి పోవుటకు ఏర్పాటు చేయబడిన చిన్న చిన్న ప్రవేశ ద్వారములు వెలుగులోనికి వచ్చాయి.

సందర్శన వేళలు

పురాతన కట్టడాలు :
సూర్యోదయం నుండి
సూర్యాస్తమయం వరకు
ప్రవేశ రుసుము ఒక్కరికి రూ.5
పురావస్తు ప్రదర్శనశాల:
ఉదయం 9 గంటల నుండి 5 గంటల వరకు
ప్రవేశ రుసుము ఒక్కరికి రూ.5
15 సంవత్సరాల లోపు పిల్లలకు ప్రవేశం ఉచితం
ప్రతి శుక్రవారం సెలవు

పురావస్తు ప్రదర్శనశాల

సాంస్కృతిక కేంద్రంగా, రాజధాని నగరంగా వాసిగాంచిన చంద్రగిరి, యాగంటి, గుడిమల్లం, గండికోటలోని శిథిల కట్టడాలు, దేవాలయాల నుంచి సేకరించిన శిలా కాంస్య ప్రతిమలను ఇతర వస్తు సముదాయాలను భారతీయ పురావస్తు సంరక్షణలో 1988లో రాజమహల్‌లో నెలకొల్పిన పురావస్తు ప్రదర్శన శాలలో యాత్రికుల దర్శనార్థం పదిలపరిచారు. శైవ, వైష్ణవ, జైన మతాలకు చెందిన శిలాకాంస్య నిర్మితములయిన అనేక దేవతా ప్రతిమలు ఇక్కడ వున్నాయి. పరశురామేశ్వర లింగమూర్తి చుట్టూ జరిపిన తవ్వకాలలో లభించిన పురావస్తు సామాగ్రిని కూడా ఇందు అమర్చారు. యాగంటి నుండి సేకరించిన నవగ్రహ ప్రతిమలు ఉన్నాయి. చోళ, విజయనగర సామ్రాజ్య కాలములకు చెందిన మనోహరములగు సోమస్కంద వేణుగోపాల, శ్రీనివాస, కోదండరామ, శ్రీదేవి, భూదేవి, పార్వతీమూర్తుల కాంస్య ప్రతిమలు ఇక్కడ వున్నాయి. ఇవిగాక కంచు పళ్లెములు, దీపములు ఆకట్టుకుంటాయి. చంద్రగిరి ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన విజయనగర చక్రవర్తుల సేవకు స్మారకంగా శ్రీకృష్ణ దేవరాయులు ఆయన దేవేరులు తిరుమల దేవి చిన్నాదేవి, వెంకటపతి రాయులు, దేవేరులతో కూడిన అచ్చుతరాయులు వార్ల కంచు శిలా ప్రతిమలకు సున్నపు ప్రతిరూపములు దర్బారుహాలు నందు ప్రదర్శించారు. కత్తులు, చాకులు, మొదలగు యుద్ధ పరికరములు, నాణెములు, పాతవ్రాత ప్రతులు, ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన గదియందు యాత్రికుల సందర్శనార్థం అమర్చారు. ఈ కోట నిర్మాణంలో ఇనుము, కొయ్య లేకుండానే నిర్మించడం ఓ ప్రత్యేకత. ప్రస్తుతం ఈ కోట పురావస్తు శాఖ ఆధీనంలో పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. శిథిలావస్థలో ఉన్న ప్రాకారాలను ప్రభుత్వం అదే తరహాలో పునర్నిర్మాణం చేసి గత వైభవ చిహ్నాలుగా రూపుదిద్దుతోంది. ప్రతిరోజూ పర్యాటకులతో ఈ ప్రాంతం కళకళలాడుతుంది. అలాగే లైట్ అండ్ షో కోట కీర్తిని వివరిస్తూ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. అలాగే చిన్నపిల్లల కోసం బోటింగ్‌ను నిర్వహిస్తున్నారు. పర్యాటకులు ఆహ్లాదకరంగా ఉండడానికి విశాలమైన గార్డెన్ ఉంది. కోటలోకి ప్రవేశిస్తే చాలు అన్ని విషయాలు మరచి దాదాపు నాలుగు గంటల పాటు ప్రశాంత వాతావరణంలో కాలం గడపొచ్చు. అప్పటి తాళపత్ర గ్రంథాలు ఇప్పటికీ మ్యూజియంలో దర్శనమిస్తాయి. పర్యాటకుల సౌకర్యార్థం క్యాంటీన్ అందుబాటులో ఉంది. ఖజానాను దాచుకోడానికి దేవాలయ గోపురాలను బోలుగా ఏర్పాటు చేసి ఓ రహస్య ద్వారం ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ఆ ప్రాంతంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతూ పట్టుబడుతుండడం గమనార్హం. ఎత్తయిన కొండపై దుర్గం ఉంది. ప్రస్తుతం ఈ దుర్గానికి ఉన్న దారి శిథిలావస్థలో ఉంది.

పురావస్తు సంగ్రహాలయము

మ్యూజియంలోని విగ్రహాలు

ఎవరి నీడ ఏదో...

ఇక్కడ నాలుగు జంతువులు...వాటి నీడలు వున్నాయి.
ఆ రెంటినీ జత చేసేయండి.



దారి కనిపెట్టండి



బుజ్జి స్టార్

హాయ్ ఫ్రెండ్స్! నేను తెలుగు సినిమా హీరోని . ఇది నా చిన్ననాటి ఫోటో..నేనెవరో కనిపెట్టి చెప్పండి.!

బొమ్మ వేద్దామా

ఆర్టిస్టు అంకుల్ ఈ వారం బొమ్మ వేయడం నేర్పిస్తాడు. అల్లరి చేయకుండా నేర్చుకోండే.



ఆ రెండు ఏవి

ఈ విచిత్ర జీవిలో మొత్తం రెండు జంతువుల శరీర భాగాలున్నాయి. అవి ఏవో గుర్తించండి.

తాత ఎక్కడ?

ఈ చిత్రంలో ఒక పల్లెటూరి వాతావరణంల కనిపిస్తుంది కదూ.అయితే ఇక్కడ ఓ తాత వున్నాడు. ఎక్కడో చూడండి.

అమ్మో...మూడు కళ్లు ...

డైనోసార్స్ అనే రాక్షస బల్లులు ఇప్పుడు లేవు. అయితే వాటిని పోలిన 'టుయోటరా'లు ఉన్నాయి. న్యూజిల్యాండ్‌లో మాత్రమే ఇవి కనిపిస్తాయి. టుయోటరా అంటే మావోరీ భాషలో 'ముళ్ళ వీపు' అని అర్థం. ఈ టుయోటరా డైనోసార్ కాలం నుంచే ఉన్నాయి. దాదాపు 220 మిలియన్ సంవత్సరాలుగా మార్పు చెందకుండా ఉన్న ప్రాణి బహుశా ఇదొక్కటే అని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.



¤ టుయోటరా పాకే జంతువే అయినప్పటికీ, బల్లితోగాని, మొసలితోగాని అంతగా పోలిక కనిపించదు. దాని శరీరం ఆదిమ కాలపు ఆకారం కలిగి ఉన్నది. చర్మం వదులుగానూ, పైభాగం పొలుసులతోనూ ఉంటుంది. మారే స్వభావంగల దాని శరీర ఉష్ణోగ్రత దానికి అత్యంత శీతల వాతావరణాన్ని కూడా తట్టుకునే శక్తినిస్తోంది.

¤ దీనికి నెత్తిమీద మూడవ కన్ను వుంటుంది. అయితే అది పేరుకు మాత్రమే. చూడ్డానికి ఉపయోగపడదు. అయితే బల్లి పిల్లగా వున్నప్పుడు ఈ మూడవ కన్ను మనకు కనిపిస్తుంది. అది పెరిగే కొద్దీ పొలుసులు ఏర్పడి కన్నును కప్పేస్తాయి.

¤ ఇవి పగటి పూట బొరియలలో దాగి ఉంటూ, రాత్రి సమయాల్లో ఆహారపు వేటకు బయలుదేరుతాయి.

¤ వీటి పై దవడకు ఒక వరుసలోను, కింది దవడకు రెండు వరుసల్లోను దంతాలుంటాయి.

¤ శత్రువు చేతిలో చిక్కినప్పుడు ... అవసరమైతే తోకను తెంచుకుని వెళ్లిపోతాయి. తర్వాత తోక మళ్లా పెరుగుతుంది. అచ్చం ఇళ్లల్లో కనిపించే బల్లికి మాదిరిగానే.

¤ ఇవి సముద్రపు ఒడ్డున తమ గూళ్లను (గుంతలు) తామే తవ్వుకుని ఏర్పాటు చేసుకుంటాయి. ఒక్కోసారి సముద్రపు పక్షులు ఏర్పాటు చేసుకున్న గుంతల్లో నివసిస్తాయి.

¤ తల్లి టుయోటారా గుడ్లు పెట్టి వాటిని వదిలేస్తుంది. పన్నెండు నెలల తరవాత గుడ్ల నుంచి పిల్లలు తమ పళ్ళతో గుడ్లపై పెంకును పగుల గొట్టుకుని వెలుపలికి వస్తాయి. తమ ఆహారాన్ని తామే వెతుక్కుంటాయి. రెండు, మూడు, నాలుగు సంవత్సరాల కొకసారి టుయోటరాలు గుడ్లు పెడతాయి.

¤ ఇవి దాదాపు వంద సంవత్సరాలు బతుకుతాయట. మరో విశేషం ఏమంటే తమకు 30 ఏళ్లు వచ్చేవరకు అవి పెరుగుతూనే వుంటాయి.

"ఆదిరాజు వారి" మన తెలంగాణము

తెలంగాణ చరిత్రకు నిలువటద్దం అంటూ ప్రముఖ కవి, నవ చేతన ప్రచురణాలయం సంపాదకులు శ్రీ ఏటుకూరి ప్రసాద్ ముందుమాట రాశారు. ఈ పుస్తకం దేశోద్ధారక గ్రంథమాల ద్వారా "వట్టికోట" వారు 1956లో తొలిసారిగా ప్రచురించారు. హైదరాబాద్ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌గా మారిన నాడు వెలువడ్డ ఈ గ్రంథం నాటి చరిత్రకు అద్దం పడుతుంది. కాకతీయ రాజవంశం, వారి సాంఘీక చరిత్రకు, తాళపత్ర గ్రంథములు, నాణెములు, శాసనములు, పాకాల సరస్సు, దేవాలయాలు, కోటలు, గోలకొండ పట్టణము, కెయిరనుల కథనము, చరిత్ర, జిల్లాలు, తాలుకాలు, సిటీ మునిసిపాలటీలు, పురములు, జనసంఖ్య ఈ పుస్తకంలో వివరంగా ఆదిరాజు వారు రాశారు. తెలంగాణములో 11,88,732 ఎకరముల భూమి వరిసాగు కింద ఉన్నది. 95,21,025 ఎకరముల భూమి మెట్ట పంట కింద ఉన్నది. వరి సాగు భూమిలో చెఱకు పంటలో నిజామాబాద్ జిల్లా రాష్ట్రమునకు ప్రథమ స్థానము వహించినది. వరంగల్ తివాచీలకు, కరీంనగర్ వెండి, బంగారు తీగ పనికి, పురము జంపఖానాలకు, పెంబర్తి ఇత్తడి పాత్రలకు, సిద్ధిపేట బట్టలకు ప్రసిద్ధి చెందినవి (పేజీ 100). ఖమ్మం దుర్గమును క్రీ.శ 1767లో బ్రిటీష్ సైన్యము వశపరచుకొనెను.(పేజీ 58). గోలకొండకు పూర్వకాలములో 'మానుగల్లు' అను పేరుండెను. మానుగల్లు అనునది ఒక కుగ్రామము. 1364లో ఓరుగల్లు రాజగు కన్నయ నాయకుడు బహమనీ నవాబుకు మానుగల్లు కోటను ధారదత్తం (పేజీ 59) చేశాడు. 1338 ఫసలీ, కరీంనగర్‌లో దొరికిన క్రీస్తుకు పూర్వము రెండు వేల సంవత్సరం నాటి (నాలుగు వేల సంవత్సరాల క్రిందటివి) వెండి నాణెములు (పేజీ 31) 11వ శతాబ్దం నుండి 14వ శతాబ్దం దాకా 300 సంవత్సరాల పాలన మహోవైభవము (పేజీ 14) ఈ గ్రంథంలో విపులంగా వివరంగా ఆదిరాజు వారి అక్షర సంపద చరిత్రకు అద్దం!! చరిత్ర అధ్యయనవాదులకు, విద్యార్థులకు చక్కటి కరదీపిక.

-టి.సి



మన తెలంగాణము
రచన: ఆదిరాజు వీరభద్రరావు
పేజీలు: 102/-, వెల: 70/-
ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్ -బండ్లగూడ, హైదరాబాద్

ఆహ్వానం

కథలు, సమీక్షల కోసం పుస్తకాలు పంపవలసిన చిరునామా :
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.

◆ కొత్త పుస్తకాలు

"సంస్కృత శ్లోకం పార్సీ గజల్, తెలుగు పద్యం వెరసి బూర్గుల" అంటారు దాశరథి. హైదరాబాద్ స్టేట్ ముఖ్యమంత్రిగా పని చేస్తూ ఆంధ్రప్రదేశ్ కోసం పదవిని త్యాగం చేసిన వ్యక్తిగా అందరి చేత గౌరవింపబడ్డారు. కవిగా, విమర్శకులుగా, బూర్గుల చాలా గొప్ప సాహిత్యవేత్త. "పారసీక్ వాఙ్మయ చరిత్ర"ను తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురించారు. బూర్గుల స్వదస్తూరి, ఫోటోలు, సారస్వత వ్యాస ముక్తావళి, పారసీక వాఙ్మయ చరిత్ర the dream of poetes, కరుణాలహరి, కవన విభాగం, పుష్పాంజలి, నివేదన అనే భాగాలుగా విభజన చేసి, ఈ విలువైన గ్రంథాన్ని సాహితీ ప్రియులకు అందించారు. అట్ట వెనుక బూర్గుల వారి సాహితీ సౌరభాన్ని శ్లాఘిస్తూ శ్రీశ్రీ, పేర్వారం జగన్నాథం, ఊట్ల కొండయ్య, డి. రామలింగం గార్ల అభిప్రాయాలు ఈ గ్రంథానికి నిండుదనం చేకూర్చాయి. బూర్గుల వారి పేరిట విడుదలైన పోస్టేజీ కవర్ స్టాంప్, చిత్ర మాలికలో ప్రముఖులతో ఫోటోలు, కోర్టు కేసుకు రాసిన స్వదస్తూరి, హిందీ స్వదస్తూరి (పేజీ 514) ప్రత్యేక ఆకర్షణ గా నిలుస్తాయి. దాశరథి గాలిబ్ గీతాలుగా బూర్గుల వారి పీఠిక వారి సాహితీ పాండిత్య ప్రకర్షణ ఓ చక్కటి మచ్చుతునక(పేజీ 446). 1960 మే నెలలో హైదరాబాద్‌లో జరిగిన ప్రథమ అఖిల భారత తెలుగు రచయితల మహాసభలో బూర్గుల వారి అధ్యక్షోపన్యాసం - వ్యాస రూపంలో (పేజీ 202) అందించారు. "తెలుగు సాహిత్యంలో యుగకర్తలు" గురించి ఎన్నో విషయాలు తెలియజేసినారు. రెడ్డి రాజుల కాలపు మత సంస్కృతులు (పేజీ 190) గురించి రాసిన వ్యాసం చాలా బాగుంది.1947 'శోభ' పత్రికలో ఈ వ్యాసం ముద్రణైంది.'నవీన వాఙ్మయము-యెంకి పాటలు' అంటూ నాటి

బూర్గుల రామకృష్ణారావు రచనలు

గోలకొండ పత్రికలో 18 ఆగస్టు 1926 నాడు ప్రచురణైన మరో మంచి వ్యాసం కూడా ఈ గ్రంథంలో ప్రచురించారు (పేజీ 171). సుజాత, శోభ, గోలకొండ పత్రికల్లో 1926-1947 సంవత్సరాల్లో రాసిన వ్యాసాలు 'సారస్వత వ్యాస ముక్తావళి'గా ప్రచురించారు. తెలుగు సాహిత్యంలో ఒక గొప్ప గ్రంథంగా పుస్తకం నిలుస్తుంది. కవరు పేజీపై బూర్గుల వారి ఆటోగ్రాఫ్ ఫోటో అలరిస్తాయి. ఇందు కేవలం కవితలు-వ్యాసాలు-పీఠికలు మాత్రమే స్వీకరించారు. మరిన్ని అంశాలు మలి ప్రచురణలో చూస్తాం. నవచేతన వారి కృషి ప్రసంసనీయం.

- ప్రసన్న కుమారి

బూర్గుల రామకృష్ణారావు రచనలు
(మొదటి సంపుటి)
కవితలు-వ్యాసాలు-పీఠికలు
పేజీలు: 518/-, వెల:330/-
ప్రతులకు: నవ చేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, హైదరాబాద్



సైకిల్ సోయగాలు

వస్తువులు, వాహనాలు ఏవైనా సరే...పాతబడ్డాయంటే...పనికిరాని వాటి కిందే లెక్క. వాటిని ఎలా వదిలించుకుందామా అని తెగ ఆలోచిస్తుంటాం. తూకానికి వేసేసి కొంతైనా డబ్బు మిగిల్చినందుకు సంతోషిస్తాం. అంతకు మించిన ఆలోచనే చేయం. ఎంత పనికిరాని వాటినైనా సరే కళాత్మకంగా, కంటికి ఇంపుగా చేయొచ్చనే అనుకోం. ఇదిగో ఇవన్నీ నిన్న మొన్నటి వరకు ... తుప్పు పట్టిన పాత, డొక్కు సైకిళ్లే. కానీ ఇప్పుడో! బోసిగా వున్న పెరటికే అందాన్నిస్తున్నాయి. ఎలా సాధ్యమైందంటే! కూసింత కళా హృదయమే కారణం. ముందుగా పాత సైకిళ్లను శుభ్రం చేసేసి పెయింటు వేశారు. ఇంట్లో అడ్డంగా పడున్న పాత బకెట్లనో, డబ్బాలనో పూల కుండీలగా మార్చేశారు. వాటిలో రంగురంగుల పూలు, కొమ్మలు అమర్చారు. సైకిల్ మీది సుమబాలల సోయగాలకు సమ్మోహితులు కాని వారుంటారా!

కురుల విరులు

మనసులు కలిసి కొంత కాలమన్నా కాక ముందే కనుమూసి గుండెలో అగాథాన్ని మిగిల్చిన హృదయ దేవేరిని ఎలా గుర్తునిలుపుకోవాలి. ఆమె స్పర్శను ఎలా శాశ్వతం చేసుకోవాలి. తరతరాల కుటుంబ బంధాల్ని దేనితో ముడివేయాలి. ఛాయా చిత్రాలు, తైల వర్ణ చిత్రాల్లో లేని గాఢ స్పర్శను అందించింది నీలాల కళ. జుత్తును అందమైన కురుల విరులుగా, విలువైన ఆభరణాలుగా, అబ్బురపరిచే అలంకరణ వస్తువులుగా తీర్చిదిద్దగా.. అలాంటి అద్భుత కురుల జ్ఞాపికలను సేకరించి మ్యూజియం తెరిచింది లైలా కొహూన్. క్వీన్ విక్టోరియా నుంచి మార్లిన్ మన్రో వరకు ఎందరివో కురులతో చేసిన ఆభరణాలు ప్రదర్శనలో కనిపిస్తాయి. అమెరికాలోని మిస్సోరి ఇండిపెండెన్స్‌లో ఈ మ్యూజియం ఉంది. సుమారు 500 నీలాల అల్లికలు, 2000 జుత్తు కళా వస్తువులు కలిగిన ఈ మ్యూజియం ప్రపంచంలో ఇది ఒక్కటే. చిన్ననాటి నుంచి కురులతో ప్రేమలో పడిన లైలా హెయిర్ డ్రస్సర్‌గా పనిచేసేది. 1954లో ఓ పురావస్తు కళాఖండాల్ని అమ్మేచోట తొలిసారిగా కురులతో చేసిన వస్తువును చూసి ఆశ్చర్యపోయింది. 12-19 శతాబ్దాల మధ్య ఓ వెలుగు వెలిగిన ఈ అద్భుత కళకు సంబంధించి విషయాలు తెలుసుకుని ఉద్వేగానికి గురైంది. అప్పటి నుంచి వాటిని సేకరిస్తూ 1986లో మ్యూజియాన్ని తెరిచింది. పాతికేళ్ల భార్య చనిపోవడంతో ఆమె చివరి చూపు సమయాన విల్లో చెట్టు కింద విలపించిన భర్త చేదు దృశ్యాన్ని చిత్రించిన సేపియా ఆమె వద్ద ఉంది. అంతరించిపోయిన ఈ కళను పునరుజ్జీవింప చేసే కృషిలో ఉంది లైలా.

లైలా

సేపియా